

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 18-12-2025 | సంపుటి - 26 | సంచిక -210 | రూ : 4 | పేజీలు: 8


## హైదరాబాద్‌కు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



2లో

- ప్రత్యేక విమానంలో హకీంపేటకు చేరుకున్న రాష్ట్రపతి
- స్వాగతం పలికిన గవర్నర్, మంత్రులు
- ఈ నెల 22 వరకు హైదరాబాద్‌లో ఉండనున్న రాష్ట్రపతి




## మూడు దేశాల పర్యటన.. ఒమన్ చేరుకున్న ప్రధాని

- మస్కట్ విమానాశ్రయంలో ప్రధానికి సైనిక వందనంతో స్వాగతం
- ఒమన్ సుల్తాన్‌తో వాణిజ్యం, రక్షణ, ఇంధన రంగాలపై చర్చలు
- భారత్-ఒమన్ దౌత్య సంబంధాలకు 70 ఏళ్లు పూర్తి
- ఇథియోపియా పర్యటన ముగించుకుని ఒమన్‌కు వచ్చిన ప్రధాని

2లో

## తిరుమల శ్రీవారి ఆర్జిత సేవల కోటా టికెట్ల విడుదల రేపే..

- మార్చి నెల శ్రీవారి ఆర్జిత సేవల టికెట్లు 18న విడుదల
- ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ వరకు నమోదుకు అవకాశం
- 22న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ టికెట్ల జారీ
- ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు 24న అందుబాటులోకి
- అదే రోజున తిరుమల, తిరుపతి గదుల కోటా విడుదల



2లో




2లో

## సంక్రాంతి పండుగకు 16 అదనపు రైళ్లు

## కాంగ్రెస్.. 'తీన్'మార్

- పంచాయతీ ఎన్నికల మూడో విడతలోనూ పైచేయి
- మొత్తంగా 56% సర్పంచి స్థానాలు కైవసం.. 30 జిల్లాల్లో ఆధిక్యం
- రెండో స్థానంలో భారాస
- భాజపాకు 688 సీట్లు

2లో



## 82 వేల ఎకరాలపై సీఎం కీలక ఆదేశం..

### పెట్టుబడులకు లైన్ క్లియర్!



2లో

- జిల్లా కలెక్టర్లతో కొనసాగుతున్న సీఎం చంద్రబాబు సమీక్ష
- 22ఏ పరిధిలోని 82 వేల ఎకరాల ఏపీఐఐసీ భూములపై కీలక ఆదేశం
- సాంకేతిక సమస్యలు లేకుంటే కేబినెట్ ముందుకు ప్రతిపాదనలు తేవాలని సూచన
- భూ కేటాయింపుల్లో టూరిజం, ఐటీ రంగాలకు అధిక ప్రాధాన్యం
- 18 నెలల్లో రూ.8.55 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్న సీఎం

## ఢిల్లీలో ప్రపంచ ఆరోగ్య సదస్సులో మోగిన ఫైర్ అలారం...

**బయటకు వెళ్లిన ప్రతినిధులు**

- సంప్రదాయ ఔషధంపై ఢిల్లీలోని భారత మండపంలో సదస్సు
- ఏం జరిగిందో తెలియక ఆందోళనకు గురైన నిర్వాహకులు, ప్రతినిధులు
- ప్రతినిధులను బయటకు పంపించిన నిర్వాహకులు
- సాంకేతిక లోపం కారణంగా అలారం మోగినట్లు గుర్తింపు

2లో



# ఢిల్లీలో ప్రపంచ ఆరోగ్య సదస్సులో మోగిన ఫైర్ అలారం..

ఢిల్లీ: ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గ్లోబల్ సమ్మిట్ ఆన్ ట్రెడిషనల్ మెడిసిన్ (సంప్రదాయ ఔషధంపై సదస్సు) రెండో ఎడిషన్ భారతదేశ రాజధాని ఢిల్లీలో నేటి నుండి ప్రారంభమైంది. ఈ అంతర్జాతీయ సదస్సులో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. ఫైర్ అలారం మోగడంతో అక్కడున్న వారంతా ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందో తెలియక అందరూ ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన నిర్వాహకులు వారందరినీ బయటకు పంపించారు. అయితే సాంకేతిక లోపం కారణంగా అలారం మోగినట్లు గుర్తించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా, డబ్ల్యూహెచ్ఓ, ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి మూడు రోజుల పాటు భారత మండపంలో ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల నుంచి పరిశోధకులు, సంబంధిత రంగ నిపుణులు, చట్టసభ సభ్యులు సహా అనేక మంది ప్రముఖులు హాజరవుతున్నారు. దాదాపు 170 మంది నిపుణులు పలు అంశాలపై మాట్లాడనున్నారు.

## షర్మిలకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, పవన్ కల్యాణ్

విజయవాడ: ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల ఈరోజు తన 51వ జన్మదినాన్ని జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆమెకు రాజకీయ పార్టీలకు అతీతంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా షర్మిలకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. "ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిల గారికి జన్మదిన శుభాకాంక్షలు. ఆమెకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను" అని చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా షర్మిలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. భగవంతుడు ఆమెకు చిరాయువు, సుఖ సంతోషాలు అందించాలని ఆకాంక్షించారు. అయితే, షర్మిల సోదరుడు, వైసీపీ అధినేత జగన్ మాత్రం ఆమెకు బహిరంగంగా శుభాకాంక్షలు తెలుపలేదు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న రాజకీయ విభేదాల నేపథ్యంలో ఈ పరిణామం మరోసారి వారి మధ్య దూరాన్ని స్పష్టం చేస్తోంది.

## మూడు దేశాల పర్యటన...
## చివరగా ఒమన్ చేరుకున్న ప్రధాని మోదీ

ఒమన్, డిసెంబర్ 17: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన మూడు దేశాల పర్యటనలో చివరి అంకానికి చేరుకున్నారు. పర్యటనలో భాగంగా బుధవారం ఆయన ఒమన్ రాజధాని మస్కట్‌లో అడుగుపెట్టారు. మస్కట్ విమానాశ్రయంలో ఒమన్ ఉప ప్రధాని (రక్షణ వ్యవహారాలు) సయ్యద్ షిహాబ్ బిన్ తారిఖ్ అల్ సయీద్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని మోదీకి సైనిక వందనంతో గౌరవ స్వాగతం లభించింది. భారత్, ఒమన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసే లక్ష్యంతో ఈ పర్యటన సాగుతోంది. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. పర్యటనలో భాగంగా ఒమన్ సుల్తాన్ హైతామ్ బిన్ తారిఖ్‌తో ప్రధాని మోదీ విస్తృత స్థాయి చర్చలు జరపనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన సహకారం, రక్షణ, భద్రత, సాంకేతికత వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు సమీక్షించనున్నారు. 2018 తర్వాత ప్రధాని మోదీ ఒమన్‌లో పర్యటించడం ఇది రెండోసారి. గతేడాది డిసెంబర్‌లో ఒమన్ సుల్తాన్ భారత్‌లో పర్యటించారు. శతాబ్దాల నాటి సముద్ర వాణిజ్యం, ప్రజల మధ్య సంబంధాలతో ఇరు దేశాల బంధం బలపడిందని విదేశాంగ శాఖ కార్యదర్శి అరుణ్ కుమార్ ఛటర్జీ తెలిపారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ ఇరు దేశాల వ్యాపార ప్రముఖులతో సమావేశమవుతారు. అలాగే, ఒమన్‌లో స్థిరపడిన భారత ప్రవాస సంఘంతో కూడా భేటీ కానున్నారు. ఒమన్ పర్యటనకు ముందు ప్రధాని మోదీ ఇథియోపియాలో రెండు రోజుల పాటు పర్యటించారు. ఇథియోపియా ప్రధాని అబే అహ్మద్ అలీ.. స్వయంగా కారు నడుపుతూ మోదీని విమానాశ్రయానికి తీసుకెళ్లి వీడ్కోలు పలకడం విశేషం. ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'గ్రేట్ ఆనర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా'ను కూడా మోదీ అందుకున్నారు.

## తిరుమల శ్రీవారి ఆర్జిత సేవల కోటా టికెట్ల విడుదల రేపే..

తిరుమల: తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) 2026 మార్చి నెలకు సంబంధించిన ఆర్జిత సేవా టికెట్ల కోటాను డిసెంబర్ 18వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవల టికెట్లను ఎలక్ట్రానిక్ డిప్ విధానంలో కేటాయిస్తారు. భక్తులు ఈ సేవల కోసం రేపటి నుంచి డిసెంబర్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. డిప్‌లో టికెట్లు పొందిన భక్తులు డిసెంబర్ 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు రుసుము చెల్లించి ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. ఇతర సేవల టికెట్లను కూడా పలు తేదీల్లో విడుదల చేయనున్నారు. డిసెంబర్ 22న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను అందుబాటులో ఉంచుతారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవల కోటాను విడుదల చేస్తారు. డిసెంబర్ 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను విడుదల చేయనున్నారు. వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. ఇక రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటాను డిసెంబర్ 24న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలలో వసతి గదుల కోటాను విడుదల చేయనున్నట్లు టీటీడీ తెలిపింది. భక్తులు ఈ తేదీలను గమనించి, టీటీడీ అధికారిక వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in ద్వారానే టికెట్లు బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

## 82 వేల ఎకరాలపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశం..

విజయవాడ: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే సంస్థలకు భూముల కొరత రాకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలో జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సమావేశంలో భాగంగా పారిశ్రామిక పెట్టుబడులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా, ఏపీఐఐసీకి చెందిన సుమారు 82 వేల ఎకరాల భూమి 22ఏ (నిషేధిత జాబితా) పరిధిలో ఉండటం వల్ల పెట్టుబడులకు ఆటంకంగా మారిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణం స్పందించిన ముఖ్యమంత్రి, ఆ 82 వేల ఎకరాల భూమికి సంబంధించిన సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎలాంటి చట్టపరమైన, సాంకేతిక ఇబ్బందులు లేకపోతే, ఆ భూములను 22ఏ పరిధి నుంచి తప్పించేందుకు కేబినెట్ సమావేశానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. భూ కేటాయింపుల్లో పర్యాటక రంగానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాత ఐటీ కంపెనీలకు కేటాయించాలని చంద్రబాబు సూచించారు. గత 18 నెలల్లో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ)లో రూ.8.55 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఆమోదం తెలిపామని, కొన్ని ప్రాజెక్టులు ఇప్పటికే నిర్మాణ పనులు కూడా ప్రారంభించాయని ముఖ్యమంత్రి తెలిపారు. భూ కేటాయింపుల్లో కలెక్టర్లు చొరవ చూపి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. విజయవాడ, విశాఖపట్నంలలో భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రైబ్యునల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ వంటి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు భూ కేటాయింపులు త్వరగా పూర్తి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. విశాఖ, తిరుపతి, అమరావతి వంటి ప్రాంతాల్లో ప్రముఖ విద్యా సంస్థల ఏర్పాటుకు కృషి చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లు, టూరిజం ప్రాజెక్టులను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని కలెక్టర్లకు సూచించారు.

## హైదరాబాద్‌కు.. చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాలం విడిది కోసం హైదరాబాద్ చేరుకున్నారు. ఆమె ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని హకీంపేట ఎయిర్‌ఫోర్స్ శిక్షణ కేంద్రానికి చేరుకున్నారు. రాష్ట్రపతికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క స్వాగతం పలికారు. ఆమె డిసెంబర్ 22 వరకు హైదరాబాద్‌లో ఉంటారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో హైదరాబాద్‌లో పలుచోట్ల ట్రాఫిక్ నిబంధనలు వర్తిస్తాయి. రేపు రాష్ట్రపతి నిలయంలోనే ఆమె విశ్రాంతి తీసుకుంటారు. 19న రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు హాజరవుతారు. 20న గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలలో పాల్గొంటారు. 21న రాష్ట్రపతి నిలయంలో నిర్వహించే పౌరుల భేటీ, ఎట్ హోమ్‌లో పాల్గొంటారు. 22న సాయంత్రం ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరుతారు.

## కాంగ్రెస్.. 'తీన్'మార్

హైదరాబాద్: రాష్ట్రంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. మొదటి, రెండో విడతల్లో సుమారు 56 శాతం స్థానాలను గెలిచిన పార్టీ మూడో విడతలోనూ అదే ఆధిక్యాన్ని కొనసాగించింది. బుధవారం మొత్తం 4,159 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవాలతో కలిపి(రాత్రి 12.30 గంటల వరకు) కాంగ్రెస్ మద్దతుదారులు 2,286 స్థానాలను గెలిచారు. భారాస 1,142, భాజపా 242, ఇతరులు 479 స్థానాల్లో విజయం సాధించారు. వీరిలో సీపీఐ మద్దతుదారులు 24 చోట్ల, సీపీఎం వారు 7 చోట్ల గెలిచారు. సిద్దిపేట మినహా మిగిలిన 30 జిల్లాల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం సాధించింది. 31 జిల్లాల్లోని 12,733 పంచాయతీ సర్పంచి పదవులకు మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. ఇందులో 7,010 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. 3,502 స్థానాల్లో భారాస గెలుపొందింది. భాజపా 688 స్థానాలు పొందగా... ఇతరులు 1,505 స్థానాల్లో గెలిచారు. నల్గొండ, ఖమ్మం, భద్రాద్రి, హనుమకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, కామారెడ్డి, యాదాద్రి జిల్లాల్లో కాంగ్రెస్ ఎక్కువ ఆధిక్యాలను పొందింది. అంతకు ముందు ఉదయం నుంచి ఓటర్లు తమ హక్కు వినియోగించుకున్నారు. మూడో విడతలో 85.77 శాతం పోలింగ్ నమోదైంది. రెండోవిడత కంటేఇది 0.9 శాతం తక్కువ. మూడు విడతల్లో కలిపి 85.30 శాతం ఓట్లు పోలయ్యాయి. మూడో విడతలోనూ యాదాద్రి భువనగిరి జిల్లాలోనే పోలింగ్ అత్యధికంగా 92.56 శాతం నమోదైంది. ఇక్కడ మహిళలు (92.33) శాతం కంటే పురుషులు (92.79 శాతం) ఎక్కువగా ఓటేశారు. నిజామాబాద్‌లో అత్యల్పంగా 76.45 శాతం పోలింగ్ నమోదైంది. మూడో విడతలో మొత్తం ఓటర్లు 50,56,334 మందికి గాను 43,37,024 (85.77 శాతం) ఓట్లు పోలయ్యాయి. వారిలో మహిళా ఓటర్లే అధికం. మొత్తం 25,77,683 మహిళా ఓటర్లలో 85.96 శాతం అంటే 22,15,683 మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. పురుష ఓటర్లు 24,78,519 మంది కాగా 21,21,269 (85.59 శాతం) ఓట్లు పోలయ్యాయి. 142 ఇతరుల్లో 72 (50.70 శాతం)మంది ఓట్లు వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడ చెదురుమదురు ఘటనలు మినహా అన్నిచోట్ల ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. నిర్మల్ జిల్లా ముథోల్‌లో 10,232 మంది ఓటర్లు ఉన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపు 500 మంది వరకు ఓటర్లు వివిధ వార్డుల్లో వరుసలో ఉన్నారు. ఇక్కడ మధ్యాహ్నం 2.30 గంటలకు పోలింగ్ ముగిసింది. మూడో విడత పోలింగ్ సరళిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డిలు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినిలు వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించారని జిల్లా కలెక్టర్లు, అధికారులు, పోలింగ్ సిబ్బందిని సీఎస్ అభినందించారు. పోలీసులు విస్తృత బందోబస్తు నిర్వహించారని డీజీపీ తెలిపారు. గత నెల 25 నుంచి మొదలైన ఎన్నికల ప్రక్రియ బుధవారంతో ముగిసింది.

**మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో జిల్లాల వారీగా పోలింగ్ శాతాలు**

| జిల్లా | శాతం | వరంగల్ | 88.21 | జయశంకర్ | 84.02 |
|---|---|---|---|---|---|
| యాదాద్రి | 92.56 | మంచిర్యాల | 87.78 | ములుగు | 83.88 |
| మెదక్ | 90.68 | సంగారెడ్డి | 87.43 | వికారాబాద్ | 83.56 |
| సూర్యాపేట | 89.25 | హనుమకొండ | 86.44 | నారాయణపేట | 83.53 |
| ఖమ్మం | 88.84 | కరీంనగర్ | 86.42 | కుమురంభీం | 83.32 |
| నల్గొండ | 88.72 | రంగారెడ్డి | 86.22 | నాగర్‌కర్నూల్ | 83.15 |
| జోగులాంబ | 88.54 | కామారెడ్డి | 85.95 | ఆదిలాబాద్ | 82.56 |
| మహబూబాబాద్ | 88.52 | పెద్దపల్లి | 85.66 | జగిత్యాల | 79.64 |
| జనగామ | 88.48 | వనపర్తి | 85.55 | రాజన్నసిరిసిల్ల | 79.14 |
| సిద్ధిపేట | 88.45 | నిర్మల్ | 84.99 | నిజామాబాద్ | 76.45 |
| మహబూబ్‌నగర్ | 88.36 | భద్రాద్రి | 84.67 | మొత్తం | 85.77 |

## సంక్రాంతి పండుగకు 16 అదనపు రైళ్లు ప్రకటించిన రైల్వే

ఢిల్లీ: సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు రైళ్లను నడపాలని నిర్ణయించినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 9 నుంచి 19 మధ్య 16 అదనపు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు తెలిపింది. ఈ రైళ్లు సికింద్రాబాద్, వికారాబాద్ నుంచి శ్రీకాకుళం రోడ్ వరకు వెళతాయని పేర్కొంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఓ ప్రకటన జారీ చేశారు.

**Additional Sankranti Special Trains**
**between various Destinations**

In view of extra rush on account of ensuing Sankranti Festival season, South Central Railway to run **16 additional special trains** to various destinations.

| Sl. | Tr. No. | From - To | Departure | Arrival | JCO |
|---|---|---|---|---|---|
| 1 | 07288 | Secunderabad – Srikakulam Rd | 19.00 | 12.30 (next day) | 09.01.2026, 11.01.2026 |
| 2 | 07289 | Srikakulam Rd – Secunderabad | 15.30 | 08.10 (next day) | 10.01.2026, 12.01.2026 |
| 3 | 07290 | Secunderabad – Srikakulam Rd | 19.00 | 12.30 (next day) | 10.01.2026, 12.01.2026, 16.01.2026, 18.01.2026 |
| 4 | 07291 | Srikakulam Rd – Secunderabad | 15.30 | 08.10 (next day) | 11.01.2026, 13.01.2026, 17.01.2026, 19.01.2026 |
| 5 | 07294 | Vikarabad – Srikakulam Rd | 17.15 | 12.30 (next day) | 13.01.2026 |
| 6 | 07295 | Srikakulam Rd – Secunderabad | 15.30 | 08.10 (next day) | 14.01.2026 |
| 7 | 07292 | Secunderabad – Srikakulam Rd | 19.00 | 12.30 (next day) | 17.01.2026 |
| 8 | 07293 | Srikakulam Rd – Secunderabad | 15.30 | 08.10 (next day) | 18.01.2026 |

## క్రీడా ఆణిముత్యాలను గౌరవించడంలో ఏపీ ఎప్పుడూ ముందుంటుంది




అమరావతి: మహిళల వన్డే ప్రపంచకప్‌లో అద్భుతమైన ప్రదర్శనతో రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చిన క్రికెటర్ శ్రీచరణికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా నిలవడంపై సీఎం చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. ఇవాళ మంత్రి నారా లోకేశ్ తెలుగు క్రికెటర్ శ్రీచరణికి రూ.2.5 కోట్ల చెక్ అందించారు. దీనిపై నారా భువనేశ్వరి స్పందించారు. క్రీడల్లో రాణిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి, వారికి సరైన ప్రోత్సాహం అందించాలన్న ప్రభుత్వ నిబద్ధతను ఆమె ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆమె, "రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచే క్రీడాకారులను గౌరవించడంలో ఆంధ్రప్రదేశ్ ఎల్లప్పుడూ ముందుంటుంది. శ్రీచరణికి ప్రభుత్వం అందిస్తున్న ఈ గుర్తింపు, మద్దతు హర్షణీయం. ఇలాంటి ప్రోత్సాహకాలు భవిష్యత్ తరాలకు గొప్ప స్ఫూర్తినిస్తాయి" అని పేర్కొన్నారు. కష్టపడి రాణించే క్రీడాకారులకు ప్రభుత్వం అండగా నిలవడం వారిలో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుందని అభిప్రాయపడ్డారు. శ్రీచరణి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, గొప్ప విజయాలు సాధించాలని నారా భువనేశ్వరి ఆకాంక్షించారు.

# శబరి యాత్రకు వెళ్లిన అయ్యప్ప స్వాములు...

* **గురుస్వామి చిట్టిబాబు ఆధ్వర్యంలో 2వేల మందికి అన్నదానం**



అందోలు, ప్రజాస్ఫూర్తి: జోగిపేట పట్టణానికి చెందిన 70 మంది అయ్యప్ప స్వాములు శబరిమలై యాత్రకు బుధవారం తరలివెళ్లారు. స్థానిక అయ్యప్ప దేవాలయంలో స్వాములకు గురుస్వామి దేవరశెట్టి సంతోష్‌కుమార్ అధ్వర్యంలో స్వాములకు ఇరుముడిలు కట్టారు. అనంతరం గురుస్వామి చిట్టిబాబు ఆధ్వర్యంలో పడి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు ముదిరాజ్ ఆధ్వర్యంలో సుమారుగా 2వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అయ్యప్ప స్వాములతో పాటు మహిళలు, భక్తులు వేల సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వాముల ఆశీర్వాదం పొందారు. 21వ సారి మాల ధరించిన సంతోష్‌కుమార్‌కు అయ్యప్ప స్వాములు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఆర్‌టీయు అధ్యక్షుడు ఎ.మాణయ్య, మాజీ సర్పంచ్ ఎస్.కృష్ణారెడ్డి, సంగుపేట సర్పంచ్ రాంచెంద్రారెడ్డి, ఇటిక్యాల సర్పంచ్ స్వప్న సురేందర్‌గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# హై టెన్షన్..!

* **విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:కొత్తగూడెం పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాల ఎదుట బుధవారం ఉదయం హై టెన్షన్ విద్యుత్ తీగలు తెగిపడటంతో ఒక్కసారిగా హై టెన్షన్ నెలకొంది. విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న సింగరేణి హై టెన్షన్ వైర్లు ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో ఉన్నఫళంగా తెగిపడ్డాయి. ఆ సమయంలో విద్యార్థులు పాఠశాలలోకి వెళ్లిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టైంది. సాధారణంగా ఈ పాఠశాల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు, తల్లిదండ్రుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఒకవేళ ఆ సమయాల్లో ఈ ఘటన జరిగి ఉంటే తీవ్ర ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉండేదని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే సింగరేణి సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేసి తెగిన తీగలను సురక్షితంగా తొలగించారు. ప్రస్తుతం ప్రమాదం లేకుండా చర్యలు చేపట్టినప్పటికీ, ఇది శాశ్వత పరిష్కారం కాదని తల్లిదండ్రులు అంటున్నారు. పాఠశాల ఎదుట ఉన్న హై టెన్షన్ విద్యుత్ లైన్లను పూర్తిస్థాయిలో పరిశీలించి, వాటి కింద రక్షణ కంచె ఏర్పాటు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సింగరేణి అధికారులను విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఆపన్నహస్తం శిక్షణను ప్రారంభించిన హైడ్రా కమిషనర్



'నేను.. నా వాళ్లతో పాటు.. చుట్టు పక్కల ఉన్న వాళ్ల గురించి ఆలోచించినప్పుడే మన జీవితానికి సార్థకత ఉంటుంది' అని హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ అన్నారు. 'పరుల కోసం పాటుపడని నరుడి బతుకు దేనికని' ప్రముఖ కవి సి.నా.రె. తన గజల్స్‌లో చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇది మానవ జీవితం పరమార్థాన్ని, ఇతరుల కోసం జీవించడం ప్రాముఖ్యతను తెలియజేసే గొప్ప వాక్యమని దీనిని అందరూ ఒంట పట్టించుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తనతో పాటు చుట్టుపక్కల వారిని కూడా సురక్షితంగా కాపాడాలనే ఉద్దేశంతో 'యువ ఆపద మిత్ర' పథకం వాలంటీర్లకు హైడ్రా ఆధ్వర్యంలో ఫతుల్‌గూడలో వారం రోజుల పాటు ఏర్పాటు చేసిన శిక్షణను హైడ్రా కమిషనర్ ప్రారంభించి ప్రసంగించారు. పరుల కోసం పాటుపడే ఆలోచనతో ఈ శిక్షణకు రావడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. రెండు చేతుల్లో ఒకటి పరులకు చేయూతనందించడానికి ఉపయోగపడాలన్నారు. మనం జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడం వరకే పరిమితమవ్వకుండా ఇతరులకు కూడా చేయూతనందించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తోటివారిని కాపాడడం ఎలా అనేది ఈ శిక్షణలో నేర్పుతారని.. మీకు కూడా మీ చుట్టుపక్కల ఉన్న పరిస్థితులపై అవగాహన ఉండాలన్నారు. అప్పుడే ప్రమాద సమయంలో తోటివారిని కాపాడగలరన్నారు. వారం రోజుల శిక్షణలో.. అన్ని మెలుకువలు నేర్చుకుని.. వాటిని మరింతమందికి మీరు తెలియజేయాలని సూచంచారు. ఈ సందర్భంగా హైడ్రా కార్యకలాపాల గురించి విద్యార్థుల సందేహాలను హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ నివృత్తి చేయడమే కాకుండా.. వారి నుంచి కూడా ఫీడ్ బ్యాక్ తెలుసుకున్నారు.

# సర్పంచ్ మేనిఫెస్టో అమలు షురూ...

* **సర్పంచ్ గా గెలిచిన మూడు రోజుల్లోనే హామీలకు కార్యరూపం...**
* **సొంత నిధులతో హామీల అమలుపై ప్రత్యేక శ్రద్ధ..**



అందోలు, ప్రజాస్ఫూర్తి: సర్పంచ్ గా తనను గెలిపిస్తే తన స్వంత నిధులతో గ్రామభివృద్ధి, పేద ప్రజలకోసం ఎన్నికల్లో విడుదల చేసిన మేనిఫెస్టో కు మూడు రోజుల్లోనే అమలులోకి వచ్చింది. ఈ నెల 14న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో అందోలు మండలం కన్ సాన్ పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సునీత మహిపాల్ గెలుపొందిన విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన జాజికర్తె గోరెమ్మ మరణించడంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గోరెమ్మ అంత్యక్రియల నిమిత్తం రూ. 6వేలు మృతురాలి కుటుంబానికి అందజేశారు. దీంతో పాటు మరో హామీ నెరవేర్చే క్రమంలో బుధవారం గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు విషయమై టెక్నీషియన్ ను పిలిచి, కెమెరాలు గ్రామంలో ఎక్కడెక్కడా ఏర్పాటు చేయాలనే విషయమై సర్పంచ్ కుమారుడు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి చర్చించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సీసీ కెమెరాల ఏర్పాటు హామీని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఇందుకోసం సీసీ కెమెరాల టెక్నీషియన్ ను బుధవారం గ్రామానికి పిలిపించి ఎస్టిమేషన్ వేయించామన్నారు. గ్రామంలోని ప్రధాన చౌరస్తాలు కవర్ చేసే విధంగా త్వరలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో 12 సిసీ ప్లస్ ఐపి కెమెరాలు బిగిస్తామని తరువాత అవసర మైన మేరకు సిసీ కెమెరా ల సంఖ్యను పెంచుతామన్నారు. ఇందుకోసం సుమారు 1,50,000 రూపాయల సొంత నిధులు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల హామీల అమలుకు కృషి చూస్తుండడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్ రెడ్డి, నాయకులు మహిపాల్, కృష్ణ, రమేష్ గౌడ్, జాను, ప్రభాకర్ రెడ్డి, నూతన ఉప సర్పంచ్ పెంటయ్య, వార్డు సభ్యులు లక్ష్మీ ప్రభ,నర్సింలు, బాల్ రాజ్, మణికంఠ గౌడ్, శివ సత్యం తో పాటు ఇతరులు పాల్గొన్నారు.




# డ్రోన్ ద్వారా తక్కువ ఖర్చుతో లాభదాయక వరి సాగు

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డ్రోన్ ద్వారా విత్తనాలు మందులు పిచికారి చేయడంతో లాభదాయకమైన వరి సాగు చేయవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బూర్గంపాడు మండలం సోంపల్లి గ్రామంలో డ్రోన్ సాంకేతికత ద్వారా నేరుగా వరి విత్తనాలు వెదజల్లే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డ్రోన్ ద్వారా వరి విత్తనాల వెదజల్లే ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే తక్కువ ఖర్చుతో లాభదాయకంగా వరి సాగు చేయవచ్చని తెలిపారు. డ్రోన్ ద్వారా వరి విత్తనాలను నేరుగా వెదజల్లడం, అలాగే గడ్డి మందులు , పురుగుమందులను పిచికారీ చేయడం ద్వారా కూలీ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. అదేవిధంగా సమయం ఆదా కావడంతో పాటు పంట స్థాపన సమానంగా జరిగి మంచి దిగుబడులు సాధించవచ్చని ఆయన అన్నారు. రైతులు ఈ విధమైన ఆధునిక పద్ధతులను స్వీకరించి వ్యవసాయంలో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ టి. భరత్ మాట్లాడుతూ, డ్రోన్ ద్వారా వరి విత్తనాలు వెదజల్లే విధానంలో సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే తక్కువ విత్తనాలు సరిపోతాయని, దీంతో విత్తన వ్యయం తగ్గుతుందని వివరించారు. ఈ విధానం ద్వారా సాగు ఖర్చులు కూడా గణనీయంగా తగ్గడంతో పాటు రైతులకు అధిక లాభాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు డ్రోన్ ద్వారా వరి విత్తనాలు వెదజల్లే ప్రత్యక్ష ప్రదర్శనను వీక్షించి, ఈ ఆధునిక సాంకేతికత ప్రయోజనాలపై అవగాహన పొందారు. కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్రోన్ వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం రైతుల్లో ఆధునిక సాంకేతికతపై నమ్మకాన్ని పెంచి, తక్కువ ఖర్చుతో లాభదాయకమైన వరి సాగుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. శరత్ చంద్ర, ఉద్యాన శాస్త్రవేత్త బి. శివ, ఏడిఏ తాతారావు, శంకర్, సోంపల్లి గ్రామానికి చెందిన అధికారులు, సిబ్బంది, సుమారు 80 మంది అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



# ఎల్లమ్మ చెరువు కలుషితం కాకుండ ప్రక్షాళన చేయాలి

* **బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు కలుషితం కాకుండ ప్రక్షాళన చేయాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు అన్నారు. బుధవారం చాయ్ బిస్కెట్ కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సేవ్ ఎల్లమ్మ చెరువు ప్లెకార్డ్స్ లతో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్విన్ కాలనీ డివిజన్ తులసి వనం అపార్ట్మెంట్స్ ఎదురుగా ఉన్న ఎల్లమ్మ చెరువులో హెచ్ఎంటి శాతవాహన నగర్ & ఇంద్రహిల్స్ సరిహద్దులోని భీమిని చెరువులో డ్రైనేజీ కాలషిత నీళ్లు చేరడంతో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు పూడికలు తీయకపోయడంతో ఏర్పడిన చెత్త వలన పందులు, దోమల, విషపురుగులతో చెరువు సరిహద్దుల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారని ఇప్పటికైనా హైడ్రా అధికారాలు గుర్తించి చెరువుని ప్రక్షాళన చేసి ఈ సమస్యల నుండి విముక్తి చేయాలనీ డిమాండ్ చేశారు. మురికినీటిని చెరువులో కలవకుండా డైవర్ట్ చేయడానికి గత మాజీ మంత్రి కేటీఆర్ ఏర్పాటు చేసిన ఎస్టీపీ పనులని కూడా నల్లేరుమీద నడకలగా చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు ఈ మురికి నీటి సమస్యలనుండి చెరువు చుట్టూ ఉన్న స్థానిక ప్రజలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాములు గౌడ్, జనార్ధన్, నాగేశ్వరరావు, జగదీష్, వెంకటేష్, శ్రీధర్, రాజు, అరవింద్, రవి, శ్రీనివాస్, నర్సింహా, ఖాజా, రహీం, ఫజల్, రామకృష్ణ, మాధవరెడ్డి, ధనరాజ్, నాగరాజు, దయానంద్, స్వరూప రాణి, దేవి రెడ్డి, ప్రీతి, మహమూదా, ధనలక్ష్మి, గణిత, జబీన్, టీమ్ ఈఎస్ఆర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బొగ్గు టిప్పర్

* **క్యాబిన్‌లో ఇరుక్కున్న క్లీనర్..**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం - విజయవాడ జాతీయ రహదారిలోగల రామవరం వద్ద బుదవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రామవరం ఎస్సీబీ నగర్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభాన్ని కొత్తగూడెం నుంచి రుద్రంపూర్ వైపు వెళ్తున్న బొగ్గు టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్‌లో ఉన్న క్లీనర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. వెనకనే వస్తున్న డీసీఎం వాహనం టిప్పర్‌ను తప్పించబోయే క్రమంలో అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కింది. ఈ ఘటనలో మరో వాహనదారుడికి గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన క్లీనర్, డ్రైవర్, మరో వాహనదారుడిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ప్రమాదానికి అతివేగమే కారణమా? లేక డ్రైవర్ మద్యం సేవించాడా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓటీ ఆశతో బొగ్గు టిప్పర్ల డ్రైవర్లు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలోనూ ఇదే మార్గంలో పలు ప్రమాదాలు జరిగి వాహనదారులు, పశువులు గాయపడిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో బొగ్గు టిప్పర్ల డ్రైవర్లపై నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించే విధంగా ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

# స్పీకర్ నిర్ణయం రాజ్యాంగ హత్య

**: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**



ఫిరాయింపు ఎమ్మెల్యేలపై శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ హత్య, ప్రజాస్వామ్య హత్య అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని కాపాడుతామని పదే పదే చెప్పుకునే కాంగ్రెస్ ప్రస్తుతం రాజ్యాంగ వ్యవస్థ అయిన స్పీకర్‌ను కూడా ప్రభావితం చేసి, రాజ్యాంగబద్ధంగా నిర్ణయం తీసుకోకుండా చేసిందన్నారు. బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తీసుకువచ్చింది కాంగ్రెస్ పార్టీయేనిని ఆ చట్టానికి రాజ్యాంగానికీ గౌరవం ఇవ్వకుండా వ్యవహరిస్తోందన్నారు. చేతుల్లో రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని దేశమంతా తిరుగుతున్న నాయకులే, రాజ్యాంగానికి కట్టుబడి ఉండాల్సిన స్పీకర్‌పై ప్రభావం చూపి ఈ తరహా నిర్ణయం తీసుకునేలా చేశారని ఆరోపించారు. స్పీకర్ పదవి స్వతంత్రంగా, రాజ్యాంగబద్ధంగా పనిచేయాల్సిన పదవి అన్నారు.

* **స్పీకర్ రాజ్యాంగాన్ని అవహేళన చేయడం సరికాదు : బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి**

రాష్ట్ర స్పీకర్ రాజ్యాంగాన్ని ఉల్లంఘించి అవహేళన చేయడం సరికాదని, సుప్రీం కోర్టు స్పష్టంగా మూడు నెలల్లో నిర్ణయాన్ని ప్రకటించాలని ఆదేశిస్తే, మార్చి 18 న ముగ్గురు ఎమ్మెల్యే లు బీఆర్ఎస్‌నుండి కాంగ్రెస్ లో చేరారు. 21 నెలలు అవుతున్నా ఇప్పటివరకు ఎందుకు కాలయాపన చేశారని, సుప్రీం కోర్టు ఎల్లుండి వరకు తీర్పు ఇవ్వాలని హెచ్చరించడంతో ప్రస్తుతం ముగ్గురి ఎమ్మెల్యే లకు ఒక ఎమ్మెల్యే పై క్లీన్ చిట్ ఇచ్చారు. మిగతా ఇద్దరు ఎమ్మెల్యే లకు సంబంధించి ఎందుకు పెండింగ్ పెట్టారో సమాధానమివ్వాలన్నారు. కేవలం ఎమ్మెల్యే వెంకట రావుది మాత్రమే ఎటువంటి ఆధారాలు లేవనీ క్లిన్ చిట్ ఇచ్చారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి ల పార్టీ ఫిరాయింపులపై ఎటువంటి తీర్పు వెలువరించకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారో చెప్పాలన్నారు.

# GHMC ఆ వివరాలు 24గంటల్లో అందుబాటులో ఉంచాలి: హైకోర్టు ఆదేశం




హైదరాబాద్: జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజనకు సంబంధించిన జనాభా వివరాలు, అధికారిక మ్యాప్‌ను డివిజన్ల వారీగా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 24 గంటల్లో ఈ వివరాలను అందుబాటులో ఉంచాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించింది. అభ్యంతరాల స్వీకరణను ఆ తర్వాత రెండు రోజుల పాటు స్వీకరించాలని ఆదేశించింది. లంగర్ హౌజ్, శాలిబండ డివిజన్ల పునర్విభజన సరిగ్గా జరగలేదంటూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఎల్. రవిచందర్, ప్రభాకర్ వాదనలు వినిపించారు. భౌగోళిక సరిహద్దులను పరిగణనలోకి తీసుకోకుండా డివిజన్లను పునర్విభజించారని, ఒక డివిజన్ దాని పక్కనున్న మరో డివిజన్ మధ్య జనాభా తేడా 10శాతానికంటే ఎక్కువ ఉండొద్దన్న నిబంధనను పట్టించుకోలేదన్నారు. డివిజన్లకు సంబంధించిన మ్యాప్‌ను కూడా ఇవ్వడంలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వివరాలేవీ లేకుండా ప్రజలు అభ్యంతరాలను ఎలా చెబుతారన్నారు. డివిజన్ల పునర్విభజనపై స్టే ఇవ్వాలని కోరారు. జీహెచ్ఎంసీ తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. పరిపాలనా సౌలభ్యం కోసమే జీహెచ్ఎంసీని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు కోర్టుకు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న డివిజన్లు ఇతర నియోజకవర్గాల్లోకి వెళ్లకుండా పునర్విభజన చేసినట్లు ఏజీ తెలిపారు. నిబంధనల మేరకే డివిజన్ల పునర్విభజన చేశామన్నారు. జనాభా, మ్యాప్‌ల వివరాలు అధికారుల వద్ద ఉన్నా.. పరిపాలన దృష్ట్యా వాటిని అధికారిక వెబ్ సైట్‌లో ఉంచలేదన్నారు. వివరాలు లేకపోతే ప్రజలు అభ్యంతరాలు ఎలా చెబుతారని, అధికారులు ఇవ్వకపోతే పిటిషనర్లు వాటిని ఎక్కడి నుంచి తెచ్చుకుంటారని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. డిసెంబర్ 31 లోపు డివిజన్లకు సంబంధించిన జనాభాను సర్దుబాటు చేయాలని కేంద్రం గడువు విధించిందని, ఈ ప్రక్రియ ఆలస్యం కాకుండా ఉండాలంటే పిటిషన్లను కొట్టేయాలని ఏజీ వాదించారు. డివిజన్ల పునర్విభజనలో కోర్టులు జోక్యం చేసుకోరాదని ఏజీ వాదించారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు.. జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజనలో జనాభా, మ్యాప్ వివరాలను అధికారిక వెబ్ సైట్‌లో 24గంటల్లోపు అందుబాటులో ఉంచాలని ఆదేశిస్తూ పిటిషన్లపై విచారణ ముగించింది.



## పల్లెపోరు..
## మూడో దశలోనూ కాంగ్రెస్‌దే పైచేయి

హైదరాబాద్: తెలంగాణలో మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ మద్దతుదారులు పైచేయి సాధించారు. మొత్తం 4,158 స్థానాల్లో ఎక్కువ చోట్ల గెలిచి ఆధిక్యాన్ని చాటారు. భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాల్‌పల్లి, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నాగర్ కర్నూల్, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, కామారెడ్డి, ఖమ్మం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. రాత్రి 10 గంటల వరకు కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవాలతో కలిపి 2219, భారత రాష్ట్ర సమితి 1147, భాజపా 240, ఇతరులు 488 సర్పంచ్ స్థానాల్లో గెలుపొందారు. మూడో దశ ఎన్నికల కోసం 182 మండలాల్లో మొత్తం 4,159 గ్రామ పంచాయతీలకు నోటిఫికేషన్ వెలువడగా... అందులో 11 సర్పంచి పదవులకు నామినేషన్లు దాఖలు కాలేదు. 394 పదవులు ఏకగ్రీవమయ్యాయి. రెండు జీపీలలో ఎన్నికలపై న్యాయస్థానం స్టే విధించింది. మిగిలిన 3,752 సర్పంచి పదవులకు బుధవారం పోలింగ్ జరిగింది.

### తెలంగాణ పంచాయతీ ఎన్నికలు..
## జగన్‌పై చంద్రబాబు విజయం

జూలూరుపాడు: తెలంగాణ పంచాయతీ ఎన్నికలు మూడోదశలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం గుండ్లరేవు గ్రామానికి జరిగిన సర్పంచి ఎన్నికల్లో భూక్యా చంద్రబాబు, బానోత్ జగన్నాథం అలియాస్ జగన్ పోటీ పడ్డారు. ఇద్దరూ కాంగ్రెస్‌లోని ఇరు వర్గీయుల మద్దతుతో బరిలో దిగారు. వీరి పేర్ల కారణంగా పోటీతోపాటు ప్రచారం కూడా ఆసక్తిగా మారింది. ఇవాళ జరిగిన పోలింగ్‌లో భూక్యా చంద్రబాబు విజయం సాధించారు. దీంతో జగన్‌పై చంద్రబాబు విజయం అంటూ చర్చ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.





### వికారాబాద్ జిల్లాలో
## బీఆర్ఎస్-కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణ

పరిగి: పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వికారాబాద్ జిల్లాలో కాంగ్రెస్ బీఆర్ఎస్ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పరిగి మండలం మాదారంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి రాములు పోలింగ్ కేంద్రానికి వెళ్లారు. అదే సమయంలో అక్కడున్న కాంగ్రెస్ మద్దతుదారులు, రాములుకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కాంగ్రెస్ మద్దతుదారులు ఆయనపై దాడికి పాల్పడ్డారు. గాయపడిన రాములును పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ఆస్పత్రిలో రాములును మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతోనే కాంగ్రెస్ నేతలు గ్రామాల్లో దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు నిష్పాక్షికంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ స్నేహ నెహరా మాదారం గ్రామానికి బయలుదేరి వెళ్లారు.

## స్పీకర్ తీర్పుపై న్యాయపోరాటం చేస్తాం: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు




హైదరాబాద్: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయంపై హైకోర్టుకు వెళ్తామని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కె.సంజయ్ తెలిపారు. ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ తీర్పు అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. "మా వాదనలు పట్టించుకోకుండా ఏకపక్షంగా తీర్పు ఇచ్చారు. తీర్పు కాపీని అధ్యయనం చేసి హైకోర్టుకు వెళ్తాం. స్పీకర్.. సింగిల్ లైన్ స్టేట్‌మెంట్‌తో పిటిషన్లను తోసిపుచ్చటం సరికాదు. సమగ్ర విచారణ చేసి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. స్పీకర్ తీర్పు రాజ్యాంగానికి విరుద్ధంగా వచ్చినట్లు భావిస్తున్నాం. సీఎం వ్యాఖ్యలను సమర్థిస్తూ ఆయన నిర్ణయం తీసుకున్నట్టు అనిపిస్తోంది. పార్టీ మారిన వారు బాహాటంగా కాంగ్రెస్ తరఫున ప్రచారం చేశారు. సుప్రీంకోర్టు కఠినంగా హెచ్చరించేంత వరకు స్పీకర్ నిర్ణయం తీసుకోలేదు. 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు వెళ్లాలి. 10 నియోజకవర్గాల్లో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయి. స్పీకర్ తీర్పుపై న్యాయపోరాటం చేస్తాం.. విజయం సాధిస్తాం.

## ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను తోసిపుచ్చిన స్పీకర్



హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో దాఖలైన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ తీర్పు వెలువరించారు. తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టి వేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారినట్టు ఆధారాలు చూపలేకపోయారని తీర్పులో పేర్కొన్నారు. అనర్హత వేటుకు తగిన ఆధారాలు లేవని, సాంకేతికంగా ఆ ఐదుగురు ఎమ్మెల్యేలు భారత రాష్ట్ర సమితిలోనే ఉన్నట్టు స్పష్టం చేశారు. మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు దాఖలు చేయగా.. ఎనిమిది మందికి సంబంధించి విచారణ పూర్తి చేశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరిపై దాఖలైన పిటిషన్లకు సంబంధించిన విచారణ ఇంకా పూర్తి కాలేదు. అనర్హత పిటిషన్లపై సభాపతి త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై ఈనెల 19న మరోమారు విచారణ జరగనుంది. ఎనిమిది మందికి సంబంధించి విచారణ పూర్తి చేసిన సభాపతి.. ఇవాళ ఐదుగురికి సంబంధించి తీర్పు ఇచ్చారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలే యాదయ్య, సంజయ్ కుమార్‌కు సంబంధించి గురువారం తీర్పు వెలువడనుంది.

# ఓటరుపై చేయిచేసుకున్న సర్పంచ్ అభ్యర్థి..
## ఇరు వర్గాల మధ్య ఘర్షణ



టేకులపల్లి: తెలంగాణ పంచాయతీ ఎన్నికల మూడో దశ పోలింగ్ నేపథ్యంలో పలు చోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఖమ్మం జిల్లా టేకులపల్లి మండలం బద్దుతండాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఓ వ్యక్తి తొలుత గుర్తింపు కార్డు లేకుండా పోలింగ్ కేంద్రానికి వెళ్లాడు. ఓటేసేందుకు అధికారులు నిరాకరించడంతో వెనుదిరిగాడు. ఆ తర్వాత గుర్తింపు కార్డుతో మరోసారి అక్కడికి వచ్చాడు. ఈ క్రమంలో గమనించిన కాంగ్రెస్ అభ్యర్థి భూక్యా గంగారావు.. సదరు వ్యక్తి దొంగ ఓటు వేస్తున్నాడని ఆరోపిస్తూ ఆగ్రహానికి గురై అతడిపై చేయిచేసుకున్నాడు. దీంతో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

**వెలుబెల్లి పోలింగ్ కేంద్రం వద్ద ఘర్షణ**

కొత్తగూడ: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని వెలుబెల్లి పోలింగ్ కేంద్రం వద్ద భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై మరొకరు పిడిగుద్దులతో దాడులు చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గొడవకు కారణమైన వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వెలుబెల్లి పోలింగ్ కేంద్రం వద్ద సర్పంచి అభ్యర్థి అక్షయ్‌కుమార్ తండ్రి సురేందర్ ఓటు వేసేందుకు వెళ్తుండగా.. భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు వీడియో తీయడంతో వివాదం మొదలై దాడులకు పాల్పడ్డారు. పోగుళ్లపల్లి పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. తోపులాటలో ఓ మహిళ కిందపడి గాయపడింది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టారు. పోగుళ్లపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్‌లో ఉన్న ఓటర్ల వద్దకు వెళ్లి నేతలు ప్రచారం చేయడం ఘర్షణకు కారణమైంది. నల్గొండ జిల్లా డిండి మండలం శాంతిగూడెంలోనూ రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. అతడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్‌లో సర్పంచ్ అభ్యర్థి వద్ద పోలీసులు నగదు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలింగ్ కేంద్రం సమీపంలో జనం గుమిగూడి ఉండటంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. సర్పంచ్ అభ్యర్థి వద్ద రూ.28,500 నగదు పట్టుబడింది.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి ఉప సర్పంచ్ అయ్యాడు..

సంగారెడ్డి రూరల్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసిన ఓ వ్యక్తి ఉప సర్పంచ్ పదవిని దక్కించుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేసేవాడు. అతడి తల్లిదండ్రులు 18 ఏళ్లపాటు గ్రామంలో పదవుల్లో ఉన్నారు. వారి బాటలోనే సేవ చేయాలని ప్రవీణ్ నిర్ణయించుకున్నాడు. ఉద్యోగాన్ని వదిలి గ్రామానికి వచ్చాడు. ఇటీవల జరిగిన తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేయాలని భావించాడు. అయితే రిజర్వేషన్ అనుకూలించకపోవడంతో తన అనుచరుడిని సర్పంచ్‌గా గెలిపించుకున్నాడు. ప్రవీణ్ వార్డు మెంబర్‌గా విజయం సాధించి ఉపసర్పంచ్ పదవిని దక్కించుకున్నాడు. సర్పంచ్, ఉపసర్పంచ్ పదవులు తాను కోరుకున్నట్లే రావడంతో మరింత సంతోషంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశాడు.



# రైళ్లలో అధిక లగేజీపై అదనపు ఛార్జీలు: అశ్వినీ వైష్ణవ్

రైళ్లలో పరిమితికి మించి లగేజీ తీసుకెళ్తే అదనపు రుసుం చెల్లించాల్సి ఉంటుందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. తరగతిని బట్టి కొంత మేర లగేజీని ఉచితంగా తీసుకెళ్లవచ్చన్న ఆయన.. పరిమితి మించితే అదనపు రుసుము చెల్లించక తప్పదన్నారు. విమానాశ్రయాల్లో అనుసరిస్తున్న మాదిరిగా రైళ్లలోనూ లగేజీ నిబంధనలు అమలు చేస్తారా? అని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి లోక్‌సభలో సమాధానమిచ్చారు. తరగతిని బట్టి ప్రయాణికులు తమ వెంట కంపార్ట్‌మెంట్‌లో తీసుకెళ్లే లగేజీపై పరిమితి ఉందని తెలిపారు. ఉచితంగా తీసుకెళ్లగలిగే లగేజీ, ఛార్జీ చెల్లించి తీసుకెళ్లాల్సిన గరిష్ఠ పరిమితి వివరాలను ఈ సందర్భంగా వెల్లడించారు. సెకండ్ క్లాస్‌లో ఉచితంగా 35 కేజీల వరకు తీసుకెళ్లొచ్చని, ఛార్జీలు చెల్లించి 70 కేజీల వరకు లగేజీని వెంట తీసుకెళ్లొచ్చన్నారు. అదే స్లీపర్ క్లాస్‌లో అయితే ఉచితంగా 40 కేజీలు, ఛార్జీలు చెల్లించి 80 కేజీలుగా పేర్కొన్నారు. థర్డ్ ఏసీ లేదా చైర్ కార్‌లో ఉచితంగా 40 కేజీలు మాత్రమే తీసుకెళ్లొచ్చని మంత్రి పేర్కొన్నారు. ఫస్ట్ క్లాస్, ఏసీ 2 టైర్‌లో ప్రయాణికులు 50 కేజీల వరకు ఉచితంగా తీసుకెళ్లొచ్చని, 100 కిలోల వరకు గరిష్ఠంగా లగేజీని ఛార్జీలు చెల్లించి వెంట తీసుకెళ్లొచ్చని పేర్కొన్నారు. ఏసీ ఫస్ట్ క్లాస్



ప్రయాణికులు 70 కేజీలు ఉచితంగా, 150 కేజీలు వరకు ఛార్జీ చెల్లించి తీసుకెళ్లొచ్చని తెలిపారు. గరిష్ఠ పరిమితి అనేది ఉచిత పరిమితితో కలిపి లెక్కిస్తామని పేర్కొన్నారు. ఉచిత పరిమితికి మించి ఎవరైనా లగేజీ తీసుకెళ్లాల్సిన వారు ముందుగా లగేజీ బుక్ చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే, 100 సెంటిమీటర్లు × 60 సెంటిమీటర్లు × 25 సెంటిమీటర్ల కొలతలకు లోబడి ఉన్న ట్రంక్స్, సూట్‌కేస్‌లు, బాక్సులను మాత్రమే కంపార్ట్‌మెంట్లోకి అనుమతిస్తామని, అంతకంటే పెద్దగా ఉన్న వాటిని బ్రేక్‌వ్యాన్/పార్సిల్ వ్యాన్‌లో తరలించాల్సి ఉంటుందన్నారు.

## మరణించి.. బతికి.. మళ్లీ శవమయ్యాడు!

బ్రహ్మపుర నగరం: అస్వస్థతతో మృతిచెందిన వ్యక్తి మృతదేహాన్ని శ్మశానంలో అంత్యక్రియల కోసం పాడె పైనుంచి కిందకు దింపుతుండగా కదిలాడు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉన్నవారంతా బతికాడంటూ కేకలు వేస్తూ.. హుటాహుటిన ఆసుపత్రికి తలించారు. పరీక్షించిన వైద్యులు అతను మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మళ్లీ బాధాతప్త హృదయాలతో శ్మశానానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.ఈ ఘటన ఒడిశాలోని గంజాం జిల్లా గంజాం నగర పంచాయతీ (ఎన్‌ఏసీ)లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గంజాం ఎన్‌ఏసీ పరిధిలోని పుయితొళకు చెందిన రాజేంద్ర రథ్ గ్రామంలోని నృసింహ స్వామి మందిరంలో అర్చకుడిగా సేవలందిస్తున్నారు. ఆదివారం ఆయన అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు గ్రామ శివారులోని రుషికుల్యా నది సమీపంలోని శ్మశానంలో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. పాడెపై రథ్ భౌతికకాయంతో శ్మశానానికి చేరుకున్నారు. అక్కడ కిందకు దింపుతున్న వారు రథ్ శ్వాస తీసుకుంటున్నట్లు గుర్తించారు. ఇదే విషయాన్ని వారు అక్కడున్న వారికి చెప్పగా, అంతా పరిశీలించి బతికే ఉన్నాడని భావించారు. హుటాహుటిన ఛత్రపురంలోని సబ్ డివిజనల్ ఆసుపత్రిలో చేర్పించగా, పరిక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. దీంతో వారంతా తిరిగి రథ్ మృతదేహాన్ని శ్మశానానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

## రైల్వేశాఖ కీలక నిర్ణయం.. 10 గంటల ముందే చార్ట్ ప్రిపరేషన్!

రైలు ప్రయాణాల్లో అనిశ్చితి తొలగించడానికి రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రైలు బయల్దేరడానికి 4 గంటల ముందు తయారుచేసే రిజర్వేషన్ చార్టును ఇకపై దాదాపు 10 గంటల ముందుగానే ఖరారు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి చార్ట్ ప్రిపరేషన్ షెడ్యూల్‌ను రైల్వే బోర్డు అప్‌డేట్ చేసింది. దాదాపు 10 గంటల ముందే టికెట్ స్టేటస్‌ను చెక్ చేసుకోవడం ద్వారా ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవడానికి వీలు కలుగుతుంది. కొత్త టైమింగ్స్ ప్రకారం.. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బయల్దేరే రైళ్లకు తొలి చార్టును ముందు రోజు రాత్రి 8 గంటలకల్లా రూపొందించాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 2.01 గంటల నుంచి రాత్రి 11.59 గంటల వరకు; అర్ధరాత్రి 12



గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు బయల్దేరే రైళ్ల తొలి చార్టును కనీసం 10 గంటల ముందు రూపొందించాలని రైల్వే బోర్డు తెలిపింది. కొత్త షెడ్యూల్ ప్రకారం చార్టుల తయారీకి సత్వరమే చర్యలు తీసుకోవాలని అన్ని జోనల్ కార్యాలయాలకు లేఖ రాసింది. దీనివల్ల చివరి నిమిషంలో ప్రయాణికులు కంగారుపడాల్సిన అవసరం ఉండదని రైల్వే వర్గాలు పేర్కొన్నాయి.

*** వాలెట్ డబ్బులు విత్‌డ్రా కుదరదు: రైల్వే మంత్రి**

ఐఆర్‌సీటీసీ వాలెట్‌లో డిపాజిట్ చేసిన సొమ్మును విత్‌డ్రా చేయడం కుదరదని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టంచేశారు. ఆ మొత్తంతో కేవలం టికెట్లు మాత్రమే కొనుగోలు చేయగలమని చెప్పారు. ఆ ఖాతా పూర్తిగా క్లోజ్ చేసిన సందర్భంలో మాత్రమే అందులో ఉన్న మొత్తం బ్యాంక్ ఖాతాకు బదిలీ అవుతుందని చెప్పారు. ఈ మేరకు లోక్‌సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్స్‌కు సంబంధించి ఆర్‌బీఐ జారీ చేసిన నిబంధనలు విత్‌డ్రాకు అంగీకరించవని స్పష్టంచేశారు.



## కాలిక్యులేటర్‌తో 'అంక శ్రేఢి' అంతుచూశాడు!

ఒడిశాలోని గంజాం జిల్లా గోపాల్‌పూర్‌లో ఉన్న పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో తాజాగా జోనల్ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. పలువురు విద్యార్థులు తమ సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. అందులో పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం 11వ తరగతి విద్యార్థి అంశుమన్ మొహంతి ప్రదర్శించిన కాలిక్యులేటర్ ప్రత్యేకాకర్షణగా నిలిచింది. ఇంతకీ ఏమిటి దీని ప్రత్యేకత? . అంశుమన్ మొహంతి పదోతరగతిలో ఉండగా గణితంలో 'అంక శ్రేఢి' అధ్యాయం కష్టంగా అనిపించేది. దీంతో ఆ ఛాప్టర్‌లోని లెక్కలకు సులువైన మార్గం కనుక్కోవాలని అప్పట్లోనే సంకల్పించాడు. ఇందుకోసం ఎన్నో పుస్తకాలు చదివాడు. యాప్‌లను చూశాడు. అలా సేకరించిన సమాచారంతో ఒక కాలిక్యులేటర్‌ను తయారు చేశాడు. దీని సాయంతో అంక శ్రేఢి లెక్కలను సులువుగా చేయొచ్చు. మొదటి పదం, పదాల సంఖ్య, సాధారణ తేడా నమోదు చేస్తే.. nth పదం, n పదాల మొత్తం లెక్కిస్తుంది. ఇందుకోసం మనం ఈ రెండు సంక్లిష్ట ఫార్ములాలు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉండదు. అంతేకాదు మ్యాథ్స్, ఫిజిక్స్ ఫార్ములాలను కూడా చెబుతుంది. నిర్మాణ రంగం నుంచి వ్యాపారాల దాకా అన్నిచోట్లా వాడగలిగేలా దీన్ని అంశుమన్ రూపొందించాడు. దీని ధర వీలైనంత తక్కువగా ఉండాలనే ఉద్దేశంతో చౌకగా వచ్చే ఆర్డునో మైక్రోకంట్రోలర్‌నే ఇందులో అంశుమన్ వినియోగించాడు. ఆర్డునో సీ లేదా సీ ప్లస్ ప్లస్ కోడ్‌తో ఈ కాలిక్యులేటర్ పనిచేస్తుంది. దీనిపై ఆకట్టుకునే ఎల్‌సీడీ డిస్‌ప్లే, అనువుగా ఉండే కీప్యాడ్‌ను బిగించాడు. 470 ఓహెచ్‌ఎం రెసిస్టర్‌తో కూడిన కనెక్టర్ వైర్, 9 వోల్టుల హెచ్‌ఐడబ్ల్యూ బ్యాటరీ, స్విచ్‌లను ఉపయోగించాడు. దీనికి 'ఏపీ కాలిక్యులేటర్' అని పేరు పెట్టాడు. దీన్ని తయారు చేయడానికి దాదాపు రూ.1500 ఖర్చు చేశానని అంశుమన్ మొహంతి తెలిపాడు. ఏదైనా కంపెనీ దీన్ని పెద్దఎత్తున తయారు చేస్తే, తక్కువ ధరకే విక్రయించవచ్చని వెల్లడించాడు.

## తండ్రితో గొడవపడి.. పీవోకే నుంచి భారత్‌లోకి ప్రవేశించిన మహిళ

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ నుంచి భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన మహిళను ఆర్మీ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. పాకిస్థాన్‌లోని కోట్లి ప్రాంతానికి చెందిన షెహ్నాజ్ అక్తర్ అనే 35 ఏళ్ల పాకిస్థానీ మహిళ నియంత్రణ రేఖ వెంబడి జమ్మూ కశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలోకి ప్రవేశించినట్లు అధికారులు వెల్లడించారు. సరిహద్దుల్లోని బాలాకోట్ సెక్టార్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో ఆమెను అరెస్టు చేసినట్లు



పేర్కొన్నారు. విచారణలో ఆమె తన తండ్రితో గొడవపడి.. ఇంటి నుంచి పారిపోయి భారత్‌లోకి ప్రవేశించినట్లు తెలిపిందన్నారు. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించడానికి ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని.. విచారణ అనంతరం సదరు మహిళను పోలీసులకు అప్పగిస్తామన్నారు.

## అండమాన్ నికోబార్.. ఆ 586 దీవులకు మీరూ పేర్లు పెట్టొచ్చు!

అండమాన్ నికోబార్‌లోని వందలాది దీవులకు పేర్లు పెట్టే అవకాశాన్ని అక్కడి యంత్రాంగం కల్పించింది. ముఖ్యంగా జనావాసాలు లేని 586 దీవులకు పేర్లు సూచించాలని సామాన్యులకు విజ్ఞప్తి చేసింది. స్థానిక ఆదివాసీ వారసత్వం, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖ వ్యక్తులు, అమరులు, ప్రత్యేకమైన వృక్ష, జంతుజాలం, జాతీయ ప్రాముఖ్యత కలిగిన చారిత్రక సంఘటనలు, భౌగోళిక లక్షణాలు కలిగిన పేర్లను సూచించవచ్చని తెలిపింది.



కేంద్రపాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ దీవుల భూభాగం 8249 చ.కి.మీటర్లు. ఇక్కడ మొత్తం 836 దీవులు ఉన్నాయి. వీటిలో 31 ద్వీపాలు మాత్రం నివాసయోగ్యంగా ఉన్నాయి. ప్రస్తుతం 586 దీవులకు పేర్లు లేవు. ప్రస్తుతం ప్రత్యేక నంబర్లతో వాటిని గుర్తిస్తున్నారు. నివాసయోగ్యం కాని ఇటువంటి 21 దీవులకు ప్రధాని మోదీ 2023 జనవరిలో నామకరణం చేశారు. ఈ దీవుల సర్వే, సముద్ర సరిహద్దులు, మ్యాప్‌లు తయారు చేసేందుకు సర్వే ఆఫ్ ఇండియా సాంకేతిక సాయం అందిస్తుంది. "దీవులకు పేర్లు సూచించాలని వివిధ ఆదివాసీ వర్గాలు, మాజీ సైనికులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, చరిత్రకారులు, పర్యావరణవేత్తలు సహా సాధారణ ప్రజలకు విజ్ఞప్తి చేశాం. ఇదో విశిష్టమైన పని" అని అండమాన్ నికోబార్ కళా, సాంస్కృతిక విభాగ డైరెక్టర్ ప్రియాంకా కుమారి పేర్కొన్నారు. పేర్లపై నిర్ణయం తీసుకున్న తర్వాత తుది ఆమోదం కోసం వాటిని కేంద్ర హోం శాఖకు పంపిస్తామన్నారు.

## ధ్యానం చేసే సమయంలో మన మెదడులో ఏం జరుగుతుంది?

*** ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ ప్రత్యేక వ్యాసం**



ఒక హింస లేని సమాజం, రోగం లేని శరీరం, గందరగోళం లేని మనసు, ఆటంకాలు లేని బుద్ధి, గాయాలు లేని స్మృతి, దుఃఖం లేని ఆత్మ.. వీటన్నింటినీ ధ్యానం మనకు అందించగలదు. ధ్యానం ఆత్మకు ఆహారం, మనసుకు శక్తి, శరీరానికి ప్రజ్ఞ. ధ్యానం అంటే ఏకాగ్రత కాదు. కూర్చొని ఆలోచించడం లేదా ఊహించడం కాదు. అది లోతైన విశ్రాంతి, చైతన్యపూర్వకమైన విశ్రాంతి. చలనం నుంచి నిశ్శబ్దానికి, శబ్దం నుంచి నిశ్శబ్దానికి చేసే ప్రయాణమే ధ్యానం. మన అసలు స్వభావమైన ఆ ప్రశాంతతకు తిరిగి చేరడం అదే ధ్యానం. ఉద్వేగం లేకుండా వచ్చే ఆనందమే ధ్యానం. ఆందోళన లేకుండా వచ్చే ఉత్సాహమే ధ్యానం. మన శరీరంపై, మనసుపై ధ్యానం కలిగించే ప్రభావాన్ని గురించి ఇప్పటికే అనేక శాస్త్రీయ పరిశోధనలు గుర్తించాయి. ఒక అధ్యయనం ప్రకారం.. ధ్యానం ప్రారంభించినప్పుడు మెదడులోని అమిగ్డాలా అనే భాగం క్రమంగా చిన్నదవుతుంది. అమిగ్డాలా పెద్దగా ఉన్నప్పుడు మనం ఆందోళనలకు, భావోద్వేగ అసమతుల్యతలకు లోనవుతాం. అలాగే ధ్యానం చేయడం వల్ల మెదడులోని గ్రే మ్యాటర్ పెరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇది సమాచార విశ్లేషణ, కండరాల నియంత్రణ, స్మృతి, భావోద్వేగాలను నియంత్రిస్తూ ఉంటుంది. నిరాశతో బాధపడుతున్న ఎంతోమంది ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా ధ్యానం సాధన చేసిన తరువాత మెరుగయ్యారు. NIMHANS కూడా డిప్రెషన్ (కుంగుబాటు)కు లోనయ్యే వారికి సుదర్శన క్రియను ఒక పరిష్కారంగా సూచించింది. కేవలం భారతదేశంలోనే కాదు, కెనడాలోని ఒంటారియో సహా అనేక దేశాలలో చికిత్సా విధానంగా దీనిని ఉపయోగిస్తున్నారు. దుఃఖం, ఆగ్రహం వంటి వివిధ మానసిక ఆరోగ్య సమస్యల నుంచి మనుషులను బయటకు తీసుకువచ్చే శక్తి ధ్యానానికి ఉందని వందలాది అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ధ్యానం సృజనాత్మకతను పెంచుతుంది, ఉత్పాదకతను పెంచుతుంది, భావోద్వేగ స్థిరత్వాన్ని అందిస్తుంది. జీవితంలో విజయానికి, సంబంధాలలో సమతుల్యతకు అవసరమైన గ్రహణశక్తి, వ్యక్తీకరణ, కమ్యూనికేషన్ మెరుగవుతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మనసుకు లోతైన విశ్రాంతిని, శరీరానికి అప్రమత్తతను ఇస్తుంది. శాస్త్రవేత్తల ప్రకారం.. మన శరీరంలోని కీలక అవయవాలన్నింటినీ నియంత్రించే వేగస్ నర్వ్ లేదా వెల్‌నెస్ నర్వ్, సత్సంగం, ధ్యానం, ప్రాణాయామ సమయంలో ఉత్తేజితం అవుతుంది. ఇది శరీర అవయవాలకు మద్దతు ఇవ్వటంతో పాటు, మన స్వరూపంపై అవగాహనను పెంచుతుంది. ధ్యానం మన రోజువారీ పనుల్లో నాణ్యతను పెంచుతుంది. శరీరానికి శక్తిని ఇస్తుంది. ఒత్తిడి అంటే.. చేయాల్సింది చాలా ఎక్కువ ఉండి, చేసేందుకు సమయం తక్కువగా, తగినంత శక్తి లేనట్టుగా అనిపించడం. ధ్యానం ఈ అత్యవసరమైన శక్తిని అందిస్తుంది. మన స్పందనలను మెరుగుపరిచి, సకారాత్మకంగా మారుస్తుంది. మన మాటల కన్నా మన ఉనికే ఎక్కువగా మాట్లాడుతుంది. మనం కోపంగా లేదా ఒత్తిడిగా ఉన్నప్పుడే కాదు, ప్రేమతో, ఆనందంతో, శక్తితో నిండినప్పుడు కూడా అది మన ఉనికిలో ప్రతిబింబిస్తుంది. ధ్యానం మనల్ని మరింత సంతోషకరమైన వ్యక్తులుగా మార్చుతుంది.

*** ధ్యానాన్ని అనుభవించడానికి ఐదు మార్గాలు**

**1. యోగా, శారీరక వ్యాయామాలు**

శరీరం కొన్ని ఆసనాలను, నిర్దిష్ట విధానంలో చేసినప్పుడు మనసు సహజంగానే ధ్యాన స్థితిలోకి ప్రవేశిస్తుంది. అతిగా అలసట లేదా అతిగా చురుకుదనం రెండూ ధ్యానాన్ని దూరం చేస్తాయి. సరైన శారీరక సమతుల్యత ఉన్నప్పుడు ధ్యానంలోకి జారిపోవడం సులభం.

**2. శ్వాస సాధనలు, ప్రాణాయామం**

శ్వాస నెమ్మదిగా, లోతుగా, నియమబద్ధంగా ఉన్నప్పుడు మనసు ప్రశాంతంగా మారుతుంది. అప్పుడు ధ్యానంలోకి అవలీలగా వెళ్లిపోగలుగుతాం.

**3. ఇంద్రియానుభవాలు**

దృశ్యం, శబ్దం, వాసన, రుచి, స్పర్శ ఏ ఇంద్రియానికైనా పూర్తిగా లొంగిపోయినప్పుడు, కొన్ని క్షణాల పాటు మనసు నిశ్చలమవుతుంది. ఆకాశాన్ని చూస్తూ ఉండటం, సంగీతంలో పూర్తిగా మునిగిపోవటం ఇవన్నీ ధ్యానంలోకి వెళ్లేలా చేస్తాయి.

**4. భావోద్వేగాలు**

లోతైన నిస్సహాయత, తీవ్ర కోపం 'ఇక అంతా అయిపోయింది!' అనే స్థితికి తీసుకెళ్తాయి. ఆ క్షణంలో నిరాశ, హింసలోకి జారిపోకుండా ఆ నిశ్చలతను అనుభవిస్తే ధ్యానం సంభవిస్తుంది.

**5. జ్ఞానం, అవగాహన - జ్ఞానయోగం**

ఈ విశ్వం చాలా పెద్దదని, మన శరీరం కోట్లాది కణాల సమాహారమని తెలుసుకున్నప్పుడు మన అంతరంగంలో ఏదో మేల్కొంటుంది. జీవితంపై మన దృష్టి పూర్తిగా మారుతుంది. ఈ అవగాహన మనల్ని ధ్యానస్థితిలోకి తీసుకువెళ్తుంది.

# మంత్రి సుభాష్ భేష్.. నిధుల మంజూరులో ఫస్ట్...





కార్మిక శాఖా మంత్రి వాశంసెట్టి సుభాష్‌ను అధిష్టానం మెచ్చుకుంది. రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి చేస్తున్న సేవలకు ప్రత్యేక ప్రశంసలు అందించింది. స్వయంగా సీఎం చంద్రబాబు నాయుడు మంత్రుల సమావేశంలో సుభాష్‌ను అభినందించారు. నియోజకవర్గంలో మంత్రిపై చేసిన సర్వేలోనూ ప్రజల నుంచి సానుకూల అభిప్రాయం వచ్చింది. దీంతో కూటమి నాయకుల నుంచి ఆనందాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా ప్రజా దర్బారు నిర్వహిస్తున్న తీరు సీఎస్ఆర్ నిధుల నుంచి నియోజకవర్గంలో చేయనున్న అభివృద్ధికి ప్రత్యేక మార్కులు దక్కాయి. మంత్రుల్లో సుభాష్‌కు రెండో స్థానం దక్కినట్లు తెలుస్తోంది. రామచంద్రపురం టిడిపి కార్యాలయంలో ప్రతీ సోమ, మంగళ వారాల్లో ప్రజా దర్బారు నిర్వహిస్తున్న తీరు ప్రశంసనీయం అని చాలా మంది అంటున్నారు. ఇక్కడి దర్బారునకు నియోజకవర్గం నలు మూలల నుంచి అధిక సంఖ్యలో సమాన్య ప్రజానికం వస్తున్నారు. వారి అర్జీలను ఆలకించి , వారి సమస్యలు అక్కడిక్కడే పరిష్కరించి పంపిస్తున్నారు. వారికి భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నారు.

*** ప్రజా సేవకుడు మాకు దొరకడం అదృష్టం**

“నియోజకవర్గానికి ప్రజా సేవకుడు దొరకడం చాలా అదృష్టం. పలు పనులు నిమిత్తం వెళ్లిన వారికి కాదనకుండా పనులు పూర్తి చేస్తున్నారు. చాలా మంది శాసన సభ్యులను చూశాం. కానీ మంత్రి సుభాష్ పని తీరు ఆకట్టుకుంది. ఆర్యవటం నుంచి మధ్యలో చాలా గ్రామాలు కలుపుతూ జగన్నాధగిరి దాకా రహదారికి నిధులు మంజూరు చేయడం చాలా ఆనందగా ఉంది.” అని విశ్రాంతి ఉద్యోగి ధనరాజు తెలిపారు.



## హజ్ యాత్రికులకు గుడ్ న్యూస్..
### రూ. లక్ష ఆర్థిక సాయం ప్రకటన

విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి పవిత్ర హజ్ యాత్రికుల కు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. గన్నవరం విమానాశ్రయం నుంచి హజ్‌కు వెళ్లే ప్రతి యాత్రికుడికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రకటించింది. ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా యాత్రకు వెళ్లే వారందరికీ రూ.లక్ష ఆర్థిక సహాయం అందించనుంది. విజయవాడ నుంచి వెళ్లే యాత్రికులపై విమాన చార్జీల భారం తగ్గించేందుకే ఈ ఆర్థిక సాయం అందిస్తోంది. గన్నవరం విమానాశ్రయం పరిసర జిల్లాల యాత్రికులకు మరింత సౌకర్యం కల్పించడంతో పాటు, ఏపీ రాజధానిగా అమరావతి ప్రాముఖ్యతను పెంచే దిశగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రం నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికులంతా విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని ఎంపిక చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

## రాజధాని అమరావతిలో ఎన్నికలు.. నామినేషన్లు ప్రారంభం




రాష్ట్ర రాజధానిలో ఎన్నికల హడావుడి మొదలైంది. వెలగపూడి సచివాలయ ఉద్యోగ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. ఉద్యోగ సంఘం కార్యవర్గ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శితో పాటు సభ్యుల పదవులకు ఈ నెల 29న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీంతో ఎన్నికల నామినేషన్ల పర్వం బుధవారం ప్రారంభమయింది. ప్రస్తుతం అభ్యర్థులు నామినేషన్లు వేస్తున్నారు. అనంతరం నామినేషన్ల ఉసంహరణ ప్రక్రియ ఉంటుంది. ఈ నెల 29తో ఉద్యోగ సంఘం కార్యవర్గం పదవీకాలం ముగియనుంది. దీంతో అదే రోజు అప్సా ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు కసరత్తులు చేశారు. ఎన్నికల తేదీని ఖరారు చేశారు. మొత్తం 9 కేటగిరిల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. సచివాలయం, అసెంబ్లీతో కలిసి 1200 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

## గ్రామ, వార్డు సచివాలయాల పేరు మార్పు..
### స్వర్ణ గ్రామంగా ప్రకటన

రాష్ట్రంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల పేరును ప్రభుత్వం మార్పు చేసింది. ఈ మేరకు ‘స్వర్ణ’ గ్రామంగా మారుస్తున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పలు ప్రభుత్వ సంస్థల్లో ప్రక్షాళన చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామ, సచివాలయ పేర్లను సైతం మార్పు చేసింది. వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. కాగా 2019 అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున గ్రామ సచివాలయ వ్యవస్థను అప్పటి సీఎం జగన్ మోహన్ రెడ్డి అందుబాటులోకి తీసుకొచ్చారు.

## నా దృష్టికి వచ్చింది..
### వెంటనే పరిష్కరిస్తాం: నారా లోకేశ్ ట్వీట్



ఇటీవల కాలంలో తెలుగురాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోతున్నాయి. దీంతో పలుచోట్ల చలి తీవ్రంగా ఉంటుంది. అంతేకాకుండా మంచు కూడా కురుస్తోంది. అయితే అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీ ప్రాంతంలోని గురుకుల, విద్యార్థులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పూట చలికి తట్టుకోలేకపోతున్నారు. పైగా హాస్టల్‌లో సరైన వసతులు లేవు. దీంతో విద్యార్థుల అవస్థలు మరింతమయ్యాయి. ఈ మేరకు విద్యార్థులు తమ సమస్యలను బయటకు చెప్పుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈ విషయం మంత్రి నారా లోకేశ్‌కు తెలిసింది. దీంతో ఆయన వెంటనే స్పందించారు. గురుకుల విద్యార్థుల అవస్థలు తమ దృష్టికి వచ్చిందని, వెంటనే పరిష్కరిస్తామని మంత్రి లోకేశ్ ఎక్స్ ద్వారా ట్వీట్ చేశారు. పాడేరు ఏజెన్సీలో చదువుతున్న గురుకుల, కేజీబీవీ విద్యార్థులు ఈ శీతాకాలంలో ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యానికే తన మొదటి ప్రాధాన్యత అని చెప్పారు. చిన్నారులకు తగిన వసతులు కల్పించి వెంటనే సమస్యను పరిష్కరించాలని అల్లూరి జిల్లా కలెక్టర్‌ను మంత్రి లోకేశ్ ఆదేశించారు.

## టీటీడీకి రూ.1.2 కోట్ల విలువైన బ్లేడ్లు అందించిన వర్టిస్ కంపెనీ



తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రముఖ సంస్థ భారీ విరాళం అందజేసింది. శ్రీవారి భక్తులు తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలో వినియోగించే బ్లేడ్లను ఏడాదికి సరిపడా ఉచితంగా అందించింది. ఈ విరాళం విలువ సుమారు రూ.1.20 కోట్లు కాగా, దీనివల్ల టీటీడీకి ఏటా బ్లేడ్ల కొనుగోలుపై అయ్యే రూ.1.16 కోట్ల వ్యయం ఆదా కానుంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ బ్లేడ్ల తయారీ సంస్థ ‘వర్టిస్’ (Vertice) ఈ విరాళాన్ని అందించింది. సంస్థ డైరెక్టర్ బొడ్డుపల్లి శ్రీధర్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి విరాళాన్ని అధికారికంగా అందజేశారు. భక్తుల కోసం ఉపయోగించే ‘సిల్వర్ మ్యాక్స్ హాఫ్ బ్లేడ్లను’ వారు విరాళంగా ఇచ్చారు. తిరుమల కల్యాణకట్టలో రోజుకు సగటున 40 వేల బ్లేడ్లను వినియోగిస్తుంటారు. ఈ నేపథ్యంలో వర్టిస్ సంస్థ అందించిన విరాళం టీటీడీకి ఆర్థికంగా ఎంతో ఊరటనివ్వనుంది. ఈ సందర్భంగా చైర్మన్ బీఆర్ నాయుడు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. “శ్రీవారి భక్తులకు సేవలో భాగస్వాములైన దాతలకు హృదయపూర్వక అభినందనలు” అని సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

## జనవరి నుంచి
# సీఎం జిల్లాల పర్యటన



ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. జనవరి నుంచి సీఎం చంద్రబాబు జిల్లాల పర్యటన చేయనున్నట్టు ప్రకటించారు. నేడు అమరావతి సచివాలయంలో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. జిల్లాల్లో ఆకస్మిక పర్యటనలు చేసి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యల పరిష్కారాన్ని స్వయంగా పర్యవేక్షిస్తానని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం సహించబోమని స్పష్టం చేసిన చంద్రబాబు.. జీరో టాలరెన్స్ విధానంతో అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవల డెలివరీలో “స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్” తరహాలో వేగం ఉండాలన్నారు. డేటా ఆధారిత పరిపాలన, ఆన్‌లైన్ సేవలు, ప్రజల సంతృప్తి స్థాయి పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పనితీరును కూడా ఆయన ప్రశంసించారు. కాగా సీఎం ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా పరిపాలనా యంత్రాంగం అప్రమత్తమయినట్టు సమాచారం.

## భారతదేశ తొలి మిస్ ఇండియా మెహర్ కాస్టలినో కన్నుమూత

భారత తొలి మిస్ ఇండియా, ప్రఖ్యాత ఫ్యాషన్ జర్నలిస్ట్ మెహర్ కాస్టలినో (81) బుధవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమెకు కుమారుడు కార్ల్, కోడలు నిషా, కుమార్తె క్రిస్టినా ఉన్నారు. ముంబైలో జన్మించిన మెహర్, 1964లో ఫెమినా మిస్ ఇండియా కిరీటాన్ని గెలుచుకుని చరిత్ర సృష్టించారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళగా ఆమె నిలిచారు. అనంతరం మిస్ యూనివర్స్, మిస్ యునైటెడ్ నేషన్స్ వంటి అంతర్జాతీయ అందాల పోటీలలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. మోడలింగ్ తర్వాత ఫ్యాషన్ జర్నలిజంలోకి అడుగుపెట్టి తనదైన ముద్ర వేశారు. 1973లో 'ఈవ్స్ వీక్లీ'లో తొలి కథనంతో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనతికాలంలోనే ఫ్యాషన్ కాలమిస్టుగా ఎదిగి, దాదాపు 160 జాతీయ, అంతర్జాతీయ పత్రికలు, మ్యాగజైన్లలో వ్యాసాలు రాశారు. ‘మ్యాన్‌స్టైల్’, ‘ఫ్యాషన్ కెలిడోస్కోప్’ వంటి పుస్తకాలు కూడా రచించారు.

## హోంమంత్రి అనితకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి లోకేశ్

*** యువగళం పాదయాత్ర హామీని నిలబెట్టుకున్నామన్న లోకేశ్**

*** కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియను యజ్ఞంలా పూర్తి చేశారని అనితకు ప్రశంస**

*** పోస్టుల భర్తీని అడ్డుకునే కుట్రలను అనిత సమర్థంగా ఎదుర్కొన్నారని కితాబు**

*** హోంమంత్రితో పాటు అధికార యంత్రాంగానికి లోకేశ్ ధన్యవాదాలు**



ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనితపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. తాను యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను హోంమంత్రి ఆధ్వర్యంలో విజయవంతంగా పూర్తి చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను ఒక యజ్ఞంలా పూర్తి చేశారంటూ మంత్రి అనితకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. “యువగళం పాదయాత్రలో కానిస్టేబుళ్ల పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చాను. కానిస్టేబుల్ పోస్టుల భర్తీని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. నా హామీని నెరవేర్చేందుకు కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియను ఒక యజ్ఞంలా చేపట్టి పూర్తి చేసిన గౌరవ హోం మంత్రి వంగలపూడి అనిత గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పోస్టుల భర్తీని అడ్డుకునేందుకు వేసిన కుట్రపూరిత కేసులను అత్యంత చాకచక్యంగా పరిష్కరించడం వెనుక అధికార యంత్రాంగానికి హోంమంత్రి గారు పూర్తి సహాయ, సహకారాలు అందించారు. సీఎం గారు, డిప్యూటీ సీఎం గారి చేతుల మీదుగా కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేసే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన హోం మంత్రి గారికి, అధికార, పోలీసు యంత్రాంగానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను” అంటూ లోకేశ్ ట్వీట్ చేశారు.

# ఓలా, ఉబర్‌కు పోటీగా.. భారత్ ట్యాక్సీ వచ్చేస్తోంది




**న్యూఢిల్లీ:** ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి ప్రైవేటు సంస్థలకు దీటుగా కేంద్ర సహకార శాఖ ఆధ్వర్యంలో దేశంలో తొలిసారిగా సహకార (కో-ఆపరేటివ్) క్యాబ్ సేవలు ప్రారంభం కాబోతున్నాయి. 'భారత్ ట్యాక్సీ' పేరుతో వస్తున్న ఈ సేవలు వచ్చే నెల నుంచి ప్రారంభం కాబోతున్నాయి. తొలుత దేశ రాజధాని ఢిల్లీలో జనవరి 1వ తేదీ నుంచి ఈ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్టు కేంద్రం తాజాగా ప్రకటించింది. ఆ తర్వాత ఈ యాప్ సేవలను దేశ వ్యాప్తంగా అందుబాటులోకి తేనున్నారు.

ఇందులో ఆటో, క్యాబ్, బైక్ సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి. ఈ సేవలకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తైనట్లు వెల్లడించింది. ఈ భారత్ ట్యాక్సీ యాప్ ఆండ్రాయిడ్, ఐవోఎస్ రెండింటిలోనూ అందుబాటులో ఉంటుంది. యూజర్లు తమ మొబైల్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇదివరకు ఉన్న క్యాబ్ ఛార్జీల నుంచి ప్రయాణికులకు ఉపశమనం కలిగించేలా.. ఎలాంటి సర్వీస్ ఛార్జీలు లేకుండానే ఈ సేవలను పొందే అవకాశముంది. సుమారు 56 వేల మంది డ్రైవర్లు భారత్ ట్యాక్సీ యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ సేవల్లో రైడ్ ద్వారా వచ్చే ఆదాయం మొత్తాన్ని (100%) డ్రైవర్లకే చెల్లిస్తారు. అతి తక్కువ నామినల్ రుసుముతో డ్రైవర్లు ఈ ప్లాట్‌ఫాంలో పనిచేయవచ్చు.

## వరుసగా మూడోరోజూ స్టాక్ మార్కెట్లది అదే బాట!

**వరుసగా మూడో సెషన్‌లోనూ నష్టపోయిన సూచీలు**

**మీడియా, రియల్టీ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి**

**రికార్డు స్థాయికి చేరిన వెండి ఫ్యూచర్స్ ధరలు**

**ఆర్బీఐ జోక్యంతో బలపడిన భారత రూపాయి**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. మీడియా, రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 120.21 పాయింట్లు నష్టపోయి 84,559.65 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 41.55 పాయింట్లు క్షీణించి 25,818.55 వద్ద ముగిసింది.

నిఫ్టీ 25,900%-%26,000 స్థాయిని దాటనంత వరకు అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సమీప కాలంలో 25,700%-%25,750 నిఫ్టీకి కీలక మద్దతు జోన్‌గా ఉందని, ఒకవేళ ఈ స్థాయి కంటే దిగువన ముగిస్తే పతనం మరింత కొనసాగవచ్చుని అంచనా వేస్తున్నారు.

మార్కెట్లు బలహీనంగా ఉన్నప్పటికీ కొన్ని ప్రధాన స్టాక్స్ లాభపడ్డాయి. ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, సన్ ఫార్మా, మారుతీ సుజుకీ, టీసీఎస్, టాటా స్టీల్ షేర్లు 1.5 శాతం వరకు లాభపడ్డాయి. మరోవైపు, ట్రెంట్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ వంటి స్టాక్స్ నష్టపోయి సూచీలపై ఒత్తిడి పెంచాయి. బ్రాడర్ మార్కెట్లలో బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.54 శాతం, స్మాల్‌క్యాప్ 0.73 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ మీడియా ఇండెక్స్ అత్యధికంగా 1.7 శాతం పతనమైంది. ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్ రంగాలు మాత్రం లాభాలతో ముగిశాయి.

ఇదిలా ఉండగా, కమొడిటీ మార్కెట్‌లో వెండి ధరలు రికార్డు స్థాయికి చేరాయి. ఎంసీఎక్స్‌లో సిల్వర్ మార్చి ఫ్యూచర్స్ సుమారు రూ. 2,05,665 వద్ద ట్రేడ్ అయింది. మరోవైపు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) జోక్యంతో యూఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కోలుకుని 89.81 వద్ద ముగిసింది.

## దమానీని వెనక్కి నెట్టిన దీపిందర్..

**టాప్-3లో ఇండిగో వ్యవస్థాపకులు!**



**ముంబై:** ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో వ్యవస్థాపకులు రాహుల్ భాటియా, రాకేశ్ గంగ్వాల్ హురున్ ఇండియా జాబితాలో తొలిసారి చోటు దక్కించుకున్నారు. స్వయంకృషిలో ఎదిగిన వ్యాపారవేత్తల జాబితాలో మూడో స్థానంలో నిలిచారు. వీరు నెలకొల్పిన ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ మార్కెట్ విలువ రూ.2.2 లక్షల కోట్లుగా హురున్ లెక్కగట్టింది. జొమాటో మాతృ సంస్థ ఎటెర్నల్ సీఈఓ దీపిందర్ గోయల్ ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ఆయన స్థాపించిన ఎటెర్నెల్ రూ.3.2 లక్షల కోట్ల మార్కెట్ విలువను సాధించింది. ఏడాదిలో 27 శాతం వృద్ధిని నమోదు చేసింది. దీంతో డీమార్ట్ అధినేత రాధాకృష్ణ దమానీని దీపిందర్ వెనక్కి నెట్టారు. ఇదే కాలంలో అవెన్యూ సూపర్‌మార్ట్స్ మార్కెట్ విలువ 13 శాతం క్షీణించి రూ.3 లక్షల కోట్లకు పరిమితమైంది. ఈ మేరకు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ప్రైవేట్, హురున్ ఇండియా టాప్-200 వ్యాపారవేత్తల జాబితా, 2025ని విడుదల చేసింది.

ఈ ఏడాది సెప్టెంబర్ 25 వరకు ఉన్న మార్కెట్ విలువలను ప్రామాణికంగా తీసుకుని ఈ జాబితాను రూపొందించారు. ఇటీవల ఇండిగో సంక్షోభం నేపథ్యంలో కంపెనీ షేర్లపై ప్రభావం పడింది. అయినప్పటికీ.. దేశీయ విమానయాన రంగంలో 65 శాతం మార్కెట్ వాటాతో ఇండిగో అగ్రగామిగా ఉందని హురున్ పేర్కొంది. అధునాత పద్ధతులతో అంతర్జాతీయంగానూ విస్తరిస్తోందని తెలిపింది.

ఈ జాబితాలో దీపిందర్ తొలిసారి స్థానం దక్కించుకున్నారు. ఆయన ప్రారంభించిన జొమాటో దేశవ్యాప్తంగా 800 నగరాల్లో సేవలందిస్తోందని నివేదిక పేర్కొంది. పోటీ కంపెనీ స్విగ్గీ సహ వ్యవస్థాపకుడు శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డి ఈ జాబితాలో ఐదో స్థానంలో ఉన్నారు. ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.1.06 లక్షల కోట్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే 5 శాతం వృద్ధి చెందింది.

పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ ఈ జాబితాలో 8వ స్థానంలో నిలిచారు. ఆయన వ్యాపార సంస్థ మార్కెట్ విలువ రూ.72,800 కోట్లుగా లెక్కించింది. గతేడాదితో పోలిస్తే 67 శాతం మేర వృద్ధి చెందింది.

ఇటీవల మార్కెట్‌లోకి ఎంట్రీ ఇచ్చిన లెన్స్‌కార్ట్ సైతం 60 శాతం వృద్ధితో రూ.67 వేల కోట్ల మార్కెట్ విలువ సాధించింది. ఈ కంపెనీని నెలకొల్పిన పీయూష్ బన్సల్, అమిత్ చౌదరి, నేహా బన్సల్, సుమిత్ కపాహీ ఈ జాబితాలో 10వ స్థానంలో నిలిచారు.

హురున్ వెలువరించిన కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.42 లక్షల కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది రూ.36 లక్షల కోట్లుగా నమోదైంది. అంటే ఏడాదిలో 15 శాతం వృద్ధి నమోదైంది.

# టీ20 ర్యాంకింగ్స్‌లో వరుణ్ చక్రవర్తే నెంబర్ 1..




**కెరీర్ బెస్ట్ రేటింగ్ నమోదు**

**టీ20 బౌలింగ్‌లో అగ్రస్థానంలో వరుణ్ చక్రవర్తి**

**కెరీర్ బెస్ట్ రేటింగ్ పాయింట్లు నమోదు**

**బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్ 5లోకి తిలక్ వర్మ**

**ర్యాంకులు మెరుగుపరుచుకున్న అర్ష్‌దీప్ సింగ్, శివమ్ దూబే**

న్యూఢిల్లీ: ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్ సంచలనం వరుణ్ చక్రవర్తి తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో వరుసగా మూడు మ్యాచుల్లో రెండేసి వికెట్లు పడగొట్టిన అతడు, కెరీర్‌లోనే అత్యుత్తమ రేటింగ్ పాయింట్లను అందుకున్నాడు. తాజాగా వరుణ్ చక్రవర్తి ఖాతాలో అదనంగా 36 రేటింగ్ పాయింట్లు చేరడంతో మొత్తం 818 పాయింట్లతో నెంబర్ 1 స్థానంలో కొనసాగుతున్నాడు. రెండో స్థానంలో ఉన్న న్యూజిలాండ్ పేసర్ జాకబ్ డఫీ (699) కంటే వరుణ్ 119 పాయింట్ల ఆధిక్యంలో ఉండటం విశేషం. ప్రస్తుతం జరుగుతున్న దక్షిణాఫ్రికా సిరీస్‌లో అద్భుతంగా రాణిస్తున్న యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ కూడా నాలుగు స్థానాలు ఎగబాకి 16వ ర్యాంకుకు చేరుకున్నాడు.

బౌలింగ్‌లోనే కాకుండా బ్యాటింగ్‌లోనూ భారత యువ ఆటగాళ్లు సత్తా చాటుతున్నారు. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ నెంబర్ 1 ర్యాంకును నిలబెట్టుకోగా, తిలక్ వర్మ నాలుగో స్థానానికి చేరుకున్నాడు. దీంతో టీ20 ప్రపంచ కప్ 2026 నాటికి ఇద్దరు భారత బ్యాటర్లు టాప్ 5లో స్థానం సంపాదించారు. ఆల్‌రౌండర్ల జాబితాలో పాకిస్థాన్‌కు చెందిన సైమ్ అయూబ్ అగ్రస్థానంలో ఉండగా, భారత్ నుంచి హార్దిక్ పాండ్యా (4), అక్షర్ పటేల్ (9) టాప్ 10లో ఉన్నారు. శివమ్ దూబే నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని 16వ ర్యాంకుకు చేరుకున్నాడు.

## ప్రపంచకప్ కోసం పక్కాగా.. శ్రీలంక కోచ్‌గా భారత మాజీ క్రికెటర్..!




**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ శ్రీలంక బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. స్వదేశంలో కప్ కొట్టాలనే కసితో ఉన్న లంక ఫీల్డింగ్ కోచ్‌గా భారత మాజీ కోచ్ ఆర్ శ్రీధర్‌ను నియమించింది. వరల్డ్‌కప్ టోర్నీ ముగిసేంత వరకూ అతడు ఫీల్డింగ్ కోచ్‌గా కొనసాగనున్నాడు. ఈ విషయాన్ని బుధవారం ఎక్స్ వేదికగా వెల్లడించింది. టీమిండియాకు కోచ్‌గా ఏడేళ్లు సేవలందించిన శ్రీధర్ ఇప్పుడు లంక క్రికెటర్లకు మెలకువలు నేర్పే పనిలో బిజీ కానున్నాడు.

పొట్టి ప్రపంచకప్ కోసం ఆతిథ్య శ్రీలంక పక్కాగా సిద్ధమవుతోంది. భారత్‌తో కలిసి ఈ మెగా టోర్నీ నిర్వహించనున్న లంక.. ఆటగాళ్ల ఫీల్డింగ్ ప్రమాణాలు పెంచడం కోసం టీమిండియా మాజీ కోచ్ ఆర్ శ్రీధర్‌ను సంప్రదించింది. ఫీల్డింగ్ కోచ్‌గా సుదీర్ఘ అనుభవమున్న అతడిని ప్రపంచకప్ ముగిసేంత వరకూ కోచ్‌గా ఉండాలని కోరింది. లంక క్రికెట్ తనను కోచ్‌గా నియమించడంపై శ్రీధర్ సంతోషం వ్యక్తం చేశాడు.

శ్రీలంక క్రికెటర్లు ఎంతో ప్రతిభావంతులు. అందరూ సమిష్టితత్వంతో పోరాడుతారు. ఫీల్డింగ్ కోచ్‌గా నా పాత్ర కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయడం కాదు. కానీ, ఆటగాళ్లలో అథ్లెటిజం, అవగాహన అనేవి.. సహజంగా పెరుగుతాయి. చురుకైన చేతులు, మెరుపు కదలికలు, భయం లేకుండా ఉండడం వంటివి క్రమంగా మెరుగవుతాయి అని శ్రీధర్ పేర్కొన్నాడు. త్వరలో పాకిస్థాన్, ఇంగ్లండ్ సిరీస్‌తో లంక కోచ్‌గా శ్రీధర్ ప్రయాణం మొదలవ్వనుంది.

**ఐర్లాండ్‌తో తొలిపోరు**

బీసీసీఐ లెవల్ 3 క్వాలిఫైడ్ కోచ్ అయిన శ్రీధర్ 2014 నుంచి 2021 వరకూ భారత జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా సేవలందించాడు. ఈమధ్యే అతడు అఫ్గనిస్థాన్ జట్టుకు కన్సల్టెంట్ కోచ్‌గా వ్యవహరించాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక వేదికగా టీ20 ప్రపంచకప్ ప్రారంభం కానుంది. మరుసటి రోజే ఐర్లాండ్‌తో శ్రీలంక తలపడనుంది.

## నమస్తే ఇండియా.. ఇంత గొప్ప ఆతిథ్యం ఇచ్చినందుకు ధన్యవాదాలు : మెస్సి



**న్యూఢిల్లీ:** అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్ లియోనల్ మెస్సి భారత పర్యటన ముగిసింది. 'గోట్ ఇండియా టూర్'లో ఇండియాకి వచ్చిన మెస్సి.. నాలుగు రోజులపాటూ ప్రధాన నగరాల్లో సందడి చేశారు. తన ఇండియా టూర్ ముగిసిన సందర్భంగా మెస్సి ఇన్‌స్టా వేదికగా భావోద్వేగ పోస్టు పెట్టారు. 'గోట్ టూర్'లో ఇండియా తనకు గొప్ప ఆతిథ్యం ఇచ్చిందంటూ చెప్పుకొచ్చారు. ఈ మేరకు భారత్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ప్రత్యేక వీడియోను పంచుకున్నారు.

'నమస్తే ఇండియా..! ఈ పర్యటనలో నాకు ఆతిథ్యం ఇచ్చిన ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, కోల్‌కతా నగరాలకు ప్రత్యేక కృతజ్ఞతలు. వెళ్లిన ప్రతీచోటా ఆత్మీయ స్వాగతం, గొప్ప ఆతిథ్యం, అఖండమైన ప్రేమ లభించింది. అందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. భారత్‌లో ఫుట్‌బాల్‌కు ఎంతో భవిష్యత్తు ఉందని ఆశిస్తున్నాను' అంటూ వీడియోకి క్యాప్షన్ రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్టు వైరల్ అవుతోంది.

# యశస్వి జైస్వాల్‌కు అస్వస్థత..

**ఆసుపత్రి పాలైన యువ ఓపెనర్**

**తీవ్ర కడుపునొప్పితో ఆసుపత్రిలో చేరిన యశస్వి జైస్వాల్**

**సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ మ్యాచ్ సందర్భంగా ఘటన**

**వైద్య పరీక్షల అనంతరం విశ్రాంతి తీసుకోవాలని సూచన**



**న్యూఢిల్లీ:** భారత యువ క్రికెటర్, ముంబై బ్యాటర్ యశస్వి జైస్వాల్ అస్వస్థతకు గురయ్యాడు. పుణెలో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా నిన్న రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడటంతో అతడిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

మ్యాచ్ జరుగుతున్నంతసేపు కడుపునొప్పితో ఇబ్బందిపడిన జైస్వాల్, ఆట ముగిసిన తర్వాత పరిస్థితి మరింత తీవ్రమవడంతో ఆదిత్య బిర్లా ఆసుపత్రిలో చేర్పించారు. అతడికి అక్యూట్ గ్యాస్ట్రోఎంటరైటిస్ (జీర్ణాశయ సమస్య) అని వైద్యులు నిర్ధారించినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం పేర్కొంది. ఆసుపత్రిలో అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. అనంతరం మందులు వాడుతూ తగినంత విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు.

ఇక, మ్యాచ్ విషయానికొస్తే ఈ హై-స్కోరింగ్ థ్రిల్లర్‌లో ముంబై మూడు వికెట్ల తేడాతో రాజస్థాన్‌పై అద్భుత విజయం సాధించింది. 217 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో జైస్వాల్ 16 బంతుల్లో 15 పరుగులు చేసి ఔటయ్యాడు. అనంతరం కెప్టెన్ అజింక్య రహానే (41 బంతుల్లో 72 నాటౌట్), సర్ఫరాజ్ ఖాన్ (22 బంతుల్లో 73) మెరుపు ఇన్నింగ్స్‌లతో ముంబైని గెలిపించారు. ముఖ్యంగా సర్ఫరాజ్ తన ఇన్నింగ్స్‌లో ఏడు సిక్సర్లు, ఆరు ఫోర్లతో విధ్వంసం సృష్టించాడు. చివర్లో అథర్వ అంకోలేకర్ (9 బంతుల్లో 26) కీలక పరుగులు చేయడంతో ముంబై మరో 11 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది.

# వారణాసి సెట్స్‌కు వస్తా

## రాజమౌళితో హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్

**టాకీస్:** 'వారణాసి' మూవీ సెట్‌కు వచ్చి షూటింగ్ చూడవచ్చా? అని హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరూన్ మన తెలుగు దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళిని కోరారు. కామెరూన్ దర్శకత్వంలో రూపొందిన విజువల్ వండర్ 'అవతార్'. ఇప్పటికే రెండు భాగాలు వచ్చిన ఈ మూవీ ఇప్పుడు ముచ్చటగా మూడో భాగం 'అవతార్: ఫైర్ అండ్ యాష్'డిసెంబరు 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'అవతార్' టీమ్ భారత్‌లో వినూత్నంగా ప్రచారానికి తెర తీసింది. దర్శక ధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి సహా కొంత మంది సినీ ప్రముఖులకు 'అవతార్ 3'ని చూపించారు. అనంతరం జేమ్స్ కామెరూన్, రాజమౌళి వీడియో కాల్ ద్వారా మాట్లాడుకున్నారు. సినిమా మేకింగ్, పాత్రల తీరు తెన్నుల గురించి ఒకరితోనొకరు చర్చించుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను







చిత్ర నిర్మాణ సంస్థ విడుదల చేసింది. ఈ సందర్భంగా 'వారణాసి' మూవీ ప్రస్తుత పరిస్థితి గురించి రాజమౌళిని కామెరూన్ అడిగి తెలుసుకున్నారు. ఏడాదిగా షూటింగ్ జరుగుతోందని, మరో ఏడెనిమిది నెలల పాటు షూటింగ్ ఉందని రాజమౌళి వివరించారు. 'వారణాసి' షూటింగ్, సెట్స్ చూడాలని ఉందన్న కామెరూన్.. 'వచ్చి చూడవచ్చా' అని అడిగారు. ఈ మాటతో రాజమౌళి తెగ సంబరపడిపోయారు. 'మీరు రావడం ఎంతో సంతోషకరమైన విషయం. మా 'వారణాసి' టీమ్ మాత్రమే కాదు. మొత్తం సినిమా ఇండస్ట్రీ థ్రిల్ అవుతుంది' అని రాజమౌళి అనగా, 'పులులతో ఏదైనా షూట్ ప్లాన్ చేస్తుంటే చెప్పు' అని కామెరూన్ సరదాగా అనడంతో నవ్వులు వెల్లివిరిశాయి. సెకండ్ యూనిట్‌కైనా కెమెరా పట్టుకుని తాను కొన్ని సీన్స్ తీస్తానని కామెరూన్ చెప్పడం గమనార్హం. ఈ సందర్భంగా ఎస్.ఎస్.రాజమౌళి మాట్లాడుతూ.. 'అందరి కంటే ముందు 'అవతార్: ఫైర్ అండ్ యాష్' చూడటం నిజంగా ఎంతో సంతోషంగా ఉంది. మూవీలో సీక్వెన్స్, విజువల్స్, పాత్రలు తీర్చిదిద్దిన విధానానికి హ్యాట్సాఫ్. మూవీ చూస్తున్నప్పుడు థియేటర్‌లో చిన్న పిల్లాడిలా అయిపోయాను. బయటకు వచ్చాక కూడా అవే ఆలోచనలు వెంటాడాయి. ముఖ్యంగా కథానాయకుడు జేక్ నైతికంగా డైలమాలో పడే సన్నివేశాలు, అతడు తీసుకునే నిర్ణయాలు ఇందులో మరింత అద్భుతంగా చూపించారు. ఇంతకు మించి ఎక్కువ మాట్లాడితే స్పాయిలర్ అవుతుంది. అవతార్ ఫ్రాంఛైజీ వెండితెరకు ఒక బెంచ్ మార్క్ అని కొనియాడారు.

# మరో హిందీ మూవీలో తమన్నా

టాకీస్: తెలుగు, తమిళం, హిందీతో పాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది తమన్నా భాటియా. ఈ ఏడాది తెలుగులో ఓదెల 2 చిత్రంలో లీడ్ రోల్‌లో నటించిన తమన్నా.. హిందీ రైడ్ 2లో కామియో రోల్‌లో మెరిసింది. తాజాగా మరో హిందీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది తమన్నా. షాహిద్ కపూర్ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఓ రోమియో చిత్రంలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీలో తృప్తి డిమ్రి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. విక్రాంత్ మస్సే, దిశా పటాని, నానా పటేకర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ భరద్వాజ్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. బిగ్ బ్జడెట్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రం హిందీ నుంచి రాబోతున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్టుల్లో ఒకటి కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఓ రోమియో షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ భామ ఖాతాలో ఇప్పటికే నాలుగు హిందీ సినిమాలుండగా.. షూటింగ్ దశలో ఉన్నాయి. మొత్తానికి బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది మిల్కీ బ్యూటీ.





# ఏఐ దుష్ప్రచారంపై శ్రీలీల విజ్ఞప్తి..

## 'దయచేసి హద్దులు దాటొద్దు' అంటూ నెటిజన్లకు పిలుపు

టాకీస్: టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ శ్రీలీల మరోసారి వార్తల్లో నిలిచింది. ఈసారి సినిమా అప్డేట్‌తో కాదు, సోషల్ మీడియాలో ఆమె చేసిన ఓ భావోద్వేగ పోస్ట్ కారణంగా చర్చకు వచ్చింది. కృత్రిమ మేధస్సు పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం, అభ్యంతరకర వీడియోలు, ఫొటోలు, ట్రోలింగ్ కంటెంట్‌పై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. రెండు చేతులు జోడించి చేసిన ఆమె విజ్ఞప్తి ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది.'పెళ్లి సందడి' సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమైన శ్రీలీల, తొలి సినిమాతోనే యువ ప్రేక్షకులను ఆకట్టుకుంది. అతి తక్కువ సమయంలోనే వరుస అవకాశాలు అందుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన ఆమె, ఒకేసారి తొమ్మిది సినిమాలకు సైన్ చేసి ఇండస్ట్రీలో రికార్డ్ సృష్టించింది. సక్సెస్, ఫెయిల్యూర్ అనే తేడా లేకుండా కెరీర్‌ను దూకుడుగా ముందుకు తీసుకెళ్తూ, ఇటీవల బాలీవుడ్‌పై కూడా దృష్టి పెట్టింది. అయితే ఇటీవల సోషల్ మీడియాలో ఏఐ పేరుతో వైరలవుతున్న కొన్ని అభ్యంతరకర కంటెంట్ తనను తీవ్రంగా కలచివేశాయని శ్రీలీల వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆమె చేసిన పోస్ట్‌లో, "నేను రెండు చేతులు జోడించి ప్రతి సోషల్ మీడియా యూజర్‌ను వేడుకుంటున్నాను. ఏఐతో క్రియేట్ చేసిన అభ్యంతరకర, అసభ్యకర కంటెంట్‌కు సపోర్ట్ చేయకండి. టెక్నాలజీ అభివృద్ధి మన జీవితాలను సులభతరం చేయడానికి ఉండాలి కానీ, వాటిని మరింత సంక్లిష్టం చేయడానికి కాదు" అంటూ హెచ్చరించారు. ఏఐ టెక్నాలజీని వినియోగించడానికీ, దుర్వినియోగం చేయడానికీ మధ్య స్పష్టమైన తేడా ఉందని ఆమె పేర్కొన్నారు. వినోదం పేరుతో మహిళలను లక్ష్యంగా చేసుకుని చేసే ట్రోలింగ్, మానసిక వేధింపులు ఎంతటి నష్టాన్ని కలిగిస్తాయో తన మాటల్లో వెల్లడించారు.

# ఓటీటీలో ఆకట్టుకుంటున్న కాంత

**టాకీస్:** మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం కాంత . సెల్వమణి సెల్వరాజ్ డైరెక్షన్‌లో పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 14న విడుదలైంది. తమిళంలో కాంత చిత్రానికి సాలిడ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ.. కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద తన ప్రభావాన్ని చూపించడంలో విఫలమైంది. తెలుగులో మాత్రం ఈ చిత్రాన్ని బోరింగ్‌గా ఫీలయ్యారు. ఈ మూవీ ఓటీటీలో మంచి రెస్పాన్స్ రాబట్టుకుంటోంది. ఇటీవలే పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో పలు ప్రధాన భాషల్లో విడుదలైంది కాంత. తాజా అప్‌డేట్ ప్రకారం కాంత చిత్రానికి ఓపెనింగ్ వీకెండ్‌లో 1.1 మిలియన్ వ్యూస్‌తో అద్భుతమైన స్పందన వచ్చింది. ఓటీటీలో విడుదలైన ఫస్ట్ వీకెండ్‌లో 1 మిలియన్ వ్యూస్ అధిగమించిన 17వ కోలీవుడ్ సినిమాగా కూడా నిలిచింది కాంత. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. సముద్రఖని, రానా కీలక పాత్రల్లో నటించారు. కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరించాడు.



# యువదర్శకుడు కేకే కన్నుమూత

**టాకీస్:** టాలీవుడ్‌లో మరో విషాదం చోటుచేసుకుంది. యువ దర్శకుడు కిరణ్ కుమార్ (కేకే) బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. ఆయన మృతితో చిత్ర పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కిరణ్ కుమార్ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'కేజేక్యూ: కింగ్.. జాకీ.. క్వీన్' చిత్రం ప్రస్తుతం విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. తన కలల ప్రాజెక్ట్ థియేటర్లలోకి రావడానికి ముందే దర్శకుడు మరణించడం చిత్ర బృందాన్ని మరియు అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కిరణ్ కుమార్ 2010లో కింగ్ నాగార్జున హీరోగా తెరకెక్కిన 'కేడి' సినిమాతో దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఆ సినిమా అప్పట్లో స్టైలిష్ మేకింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. నాగార్జున లాంటి పెద్ద హీరో తనకు అవకాశం ఇవ్వడం వల్లే తాను దర్శకుడిగా ఎదగగలిగానని కిరణ్ కుమార్ ఎప్పుడూ కృతజ్ఞతతో ఉండేవారు. ఇండస్ట్రీలో ఆయనను అందరూ 'కేకే' అని ఆప్యాయంగా పిలుచుకునేవారు. కాగా.. కిరణ్ కుమార్ మృతి పట్ల టాలీవుడ్‌కు చెందిన పలువురు నటీనటులు, దర్శకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రతిభావంతుడైన దర్శకుడిని కోల్పోవడం బాధాకరమని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.